ప్రజాశక్తి విజయనగరం

శుక్రవారం
జనవరి 5
2018
పేజీలు 12





'బాబూ' గుర్తుందా..!

- 'జన్మభూమి' హామీల్లో ఒక్కటీ నెరవేరలేదు
- ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టులు
- పంపుసెట్ బిల్లులు చెల్లించకపోవడంతో రైతుల ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో పేదరికం ఉన్నా... అభివృద్ధికి దోహదపడే అపారమైన సహజ వనరులు ఉన్నాయి. వీటి వినియోగంతో జిల్లాను మొదటి స్థానంలో నిలబెడతా.

– ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2017 జనవరి 6న విజయనగరం మండలం ద్వారపూడి గ్రామానికి వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీ.

నదుల అనుసంధానంతో జిల్లాను సస్యామలం చేస్తాం. వచ్చే ఏడాదిలోపు ప్రతి కుటుంబానికీ గ్యాస్ కనెక్షన్ ఇస్తాం. కోర్టు కేసులున్నవి మినహా భూ వివాదాలన్నీ పరిష్కరిస్తాం.

– ఇదీ 2016 జనవరి 2న బొండపల్లి మండల కేంద్రంలో జరిగిన జన్మభూమి సభలో సిఎం హామీ.

వీటితోపాటు గజపతినగరంలో డిగ్రీకాలేజీ ఏర్పాటుకు, జిల్లా కేంద్ర ఆసుపత్రి, పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, పార్వతీపురం ఏరియా ఆసుపత్రుల్లో రూ.కోట్ల విలువగల వైద్యపరికరాలు అందుబాటులోకి తెస్తామంటూ బొండపల్లి సభలో హామీ ఇచ్చారు. అంతకు ముందుకు ఎల్‌కోట, డెంకాడ మండలం సింగవరం, చీపురుపల్లి వచ్చినప్పుడు కూడా ఇటువంటి హామీలే ఇచ్చారు. ఏడాదిలోపు గజపతినగరం బ్రాంచి కాలువ నిర్మించి వేల ఎకరాలకు తోటపల్లి జలాశయం నుంచి సాగు నీరిందిస్తామని కూడా చెప్పారు. ఇవేవీ నెరవేరలేదు. ఎన్టీఆర్ జలసిరి ద్వారా బోర్లు, పంపుసెట్‌లు మంజూరు చేస్తామని, వ్యవసాయంతో పాటు దాని అనుబంధ రంగాలైన కోళ్లు, చేపలు, పాడి పరిశ్రమల్లో ప్రోత్సహిస్తామన్నారు. ఆచరణలో ఎటువంటి సహకారమూ ప్రజలకు అందలేదు. పైగా బోర్లు పంపుసెట్లకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులో మునిగిపోయారు. ఇటువంటి ఇబ్బందివల్లే ఇటీవల జియ్యమ్మవలస మండలం బాసంగి గ్రామానికి చెందిన మిగతా 4లో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్రమంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ్‌కృష్ణ రంగారావు

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

పరిశీలించిన మంత్రులు గంటా, సుజయ్‌కృష్ణ

ప్రజాశక్తి–బొబ్బిలి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం స్థానిక రాజా కళాశాల మైదానంలో జరిగే ఐదోవిడత జన్మభూమి కార్యక్రమానికి చంద్రబాబు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ యుద్ధప్రాతిపదికన అధికారులు పూర్తి చేశారు. ఏర్పాట్లను గురువారం జిలాఇ్ల ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర గనులశాఖా మంత్రి ఆర్‌వి సుజయ్‌కృష్ణ రంగారావు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మిగతా 4లో

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూలు

– ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నర్సీపట్నం నుండి బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు గ్రోత్‌సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు.

–మధ్యాహ్నం 2.00 గంటలకు ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు కళాశాల మైదానానికి చేరుకొని, జన్మభూమి సభలో పాల్గొంటారు.

– 4.30 గంటల వరకు అక్కడ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సాయంత్రం 4.45 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ బయలుదేరి వెళతారు.

– ఈ సందర్భంగా బొబ్బిలిలో నిర్మించనున్న మినీ స్టేడియంకు శంకుస్థాపన చేస్తారు.

– సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను, సంక్రాంతి సంబరాలను తిలకిస్తారు.

అధికారులపై 'తమ్ముళ్ల' పెత్తనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అక్రమాలకు ఒప్పుకోనివారిపై అవినీతి ముద్ర !
నలిగిపోతున్న అధికార యంత్రాంగం
సిఎం చొరవ చూపకపోతే పాలన అస్తవ్యస్తమే

జిల్లా అధికారులపై అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల పెత్తనం రోజురోజుకూ పెరుగుతోంది. ఇందుకు జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని వేదికగా చేసుకుంటున్నారు. దీంతో, అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచక్కగా మారుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లాకు వస్తున్న సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలా? వద్దా? అనే చర్చ అధికారుల్లో సాగుతోంది. ఈ విషయాన్ని సాగదీస్తే రాజకీయ ఒత్తిళ్ల మరింత పెరుగుతాయని కొందరు అధికారులు భయపడుతుండగా, తాడోపేడో తేల్చుకోకపోతే నిత్యం మానసికంగా ఇబ్బందులు ఎదుర్కోకతప్పదనే వాదన వినిపిస్తోంది. జెడ్పీలో ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో గజపతినగరం ఎమ్మెల్యే కెఎనాయుడు, బొండపల్లి, విజయనగరం, పూసపాటిరేగ జెడ్పిటిసి సభ్యులు బండారు బాలాజీ, తుంపల్లి రమణ, ఆకిరి ప్రసాదరావు, అధికారులను తీవ్ర పదజాలంతో దూషించిన విషయం విధితమే. దీనిపై మిగతా 4లో

వీధుల్లో విద్యార్థులు... పూర్తికాని పాఠాలు



'జన్మభూమి'లో భాగంగా ఆటలాడుకుంటున్న విద్యార్థులు

'జన్మభూమి'లో విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వామ్య ఫలితం

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

మరో రెండునెలల్లో పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. వారితోపాటు మిగిలిన విద్యార్థులు కూడా పరీక్షలు రాయాల్సి ఉంది. దీనికి తోడు మరో పది రోజుల్లో సంక్రాంతి పండగ ఉన్నందున ప్రభుత్వం 10 రోజులు పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జన్మభూమి కార్యక్రమాల్లో విద్యార్థులను మిగతా 4లో


మహాసభల కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా మహాసభల విజయవంతానికి ముమ్మర ఏర్పాట్లు

పార్వతీపురం టౌన్ : స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో ఈనెల 9, 10 తేదీల్లోనిర్వహించనున్న సిపిఎం 8వ జిల్లా మహాసభలకు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నట్టు సిపిఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి అన్నారు. తొలుత మహాసభలకు సంబంధించిన గోడపత్రికను రాయగడరోడ్డు శివారున గల వారపుసంతలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, సభ్యులు బి.సూరిబాబుతో కలిసి ఆవిష్కరించారు. మహాసభలు విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభ ప్రాంగణానికి మజ్జి సూర్యనారాయణ, ప్రతినిధుల సభ జరుగుతున్న ప్రాంగణానికి యేటూరి రామారావు, హాలుకు పర్సా సత్యనారాయణ (సిఐటియు మాజీ అధ్యక్షులు) పేర్లను నామకరణం చేయాలని పార్టీ జిల్లా కమిటీ నిర్ణయించిందని తెలిపారు. మజ్జి సూర్యనారాయణ బలిజిపేట మండలంలో పార్టీ నిర్మాణంలో సీనియర్ కార్యకర్త, రైతు సంఘం జిల్లా నాయకులు క్రమశిక్షణకు నీతి, నిజాయితీకి నిలువటద్దమన్నారు. యేటూరి రామారావు పార్వతీపురం పట్టణంలో మొట్టమొదటగా సిఐటియు అనుబంధంగా షాపు ఎంప్లాయిస్ యూనియన్ పెట్టారని తెలిపారు. పర్సా సత్యనారాయణ సిఐటియు ఏర్పాటు నుంచి రాష్ట్ర పార్టీ కార్యకర్తలకు ఆదర్శ ప్రాయుడని, ఎన్నో త్యాగాలు చేసి కమ్యూనిస్టు విలువలకు నిలువటద్దమన్నారు. వీరి ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం మహాసభలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు.

పింఛను ఇప్పించరూ...

కురుపాం : రెండేళ్ల క్రితమే తన భర్త మృతి చెందాడని, ఇటీవల తాను కూడా అనారోగ్యానికి గురయ్యానని, తనకు వితంతు పింఛను మంజూరు చేయాలని ఏగులవాడ పంచాయతీ రజ్జలి గ్రామానికి చెందిన ఆరిక కన్నలమ్మ అధికారులను కోరింది. తనకు ఇద్దరు కుమార్తెలున్నారని, వారికి వివాహాలు జరిగిపోవడంతో ఏదిక్కూలేని అనాధగా ఉన్నానని, తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు పింఛను మంజూరు చేయాలని కోరింది.

నర్సిపురంలో చెంబుకు శవయాత్ర

పార్వతీపురంరూరల్: జిల్లాలోని అన్ని పంచాయతీలను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చేందుకు వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన కల్పించి గ్రామస్తులను చైతన్య పరిచేందుకు స్వచ్ఛమిషన్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో చెంబుకు శవయాత్ర నిర్వహించారు. చెంబును మనిషి ఆకారంలో తయారు చేసి, దానికి శవానికి కట్టినట్లుగా పాడి కట్టి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరిగించారు. బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలకాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె.సత్యనారాయణ, విఆర్ఒ సింహాచలం నాయుడు, అంగన్‌వాడీకార్యకర్తలు, గ్రామపెద్దలు బడే రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.


శంబుకు శవయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

సమస్యల పరిష్కారానికే 'జన్మభూమి' : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజా సమస్యల పరిష్కరించేందుకే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ డి.జగదీష్, ఎమ్మెల్యే బి.చిరంజీవులు అన్నారు. పట్టణంలోని 4, 5, 6 వార్డుల్లో గురువారం జరిగిన జన్మభూమి కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నాలుగో వార్డులో జరిగిన సభలో వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ అభివృద్ధి ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.శ్రీదేవి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యాన గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా వార్డుల కౌన్సిల్ సభ్యులు మజ్జి సునీత, చొక్కాపు వెంకటరమణ, మహేశ్వరి, టిడిపి నాయకులు మజ్జి వెంకటేష్, మజ్జి కృష్ణమోహన్, బి.సీతారాం, కోలా వెంకటరావు, కోలా మధుసూదనరావు, సురగాల ఉమా, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, మేనేజర్ కె.అప్పలరాజు, ఆర్ఒ కెజి శంకరరావు, ఆర్ఐ పి.శంకరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులను అడ్డుకున్న పోలీసులు

పట్టణ సమస్యలపై అడిగేందుకు నాలుగో వార్డులో జరుగుతున్న జన్మభూమి కార్యక్రమానికి వెళ్లిన వైసిపి నాయకులను పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. ఈ వార్డులో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్‌లకు పలు సమస్యలపై


వైసిపి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

తెలియజేసేందుకు వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఉదయభాను, పట్టణ యువజన అధ్యక్షులు రణబేరి బంగారునాయుడు, నాయకులు గొంగాడ లక్ష్మణరావు, చుక్క లక్ష్మంనాయుడు, కె.రాఘవకుమార్ తదితరులు సభ స్థలానికి చేరుకున్నారు. అయితే ఎస్ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యాన ముందస్తుగా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వైసిపి నాయకులు సభా ప్రాంగణంలో నినాదాలుచేసి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో అర్హులైన వారికి రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లు ఇవ్వడంలేదని, టిడిపి కార్యకర్తలకు, జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సులు చేసిన వారికి మాత్రమే అందిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదని, కేవలం పార్టీ కార్యక్రమంలా నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

నిరసనల మధ్య 'జన్మభూమి' సభలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం, వెంకంపేట, ఎల్ఎన్‌పురంలో గురువారం జరిగిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమాలు స్థానికుల నిరసనల మధ్య కొనసాగాయి. ఎంపిపి హరిప్రియాథాట్రాజ్ అధ్యక్షతన చినబొండల్లి తొలుత ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉపాధిహామీ నివేదిక చదువుతుండగా గతంలో గ్రామస్తులు ఎవరికి వారు తవ్వుకున్న ఇంకుడు గుంతల డబ్బులు సర్పంచ్ ఖాతాలో పడినట్లుగా అధికారులు తెలిపినా తమకు ఇప్పటికీ ఇవ్వలేదని నిరసనకు దిగారు. అర్హులైన కొందరికి పింఛన్లు ఎందుకు మంజూరు కాలేదంటూ ఎంపిటిసి సభ్యులు గండి శంకరరావు ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌ను గ్రామసభలో నిలదీయగా కొంతసేపు గందరగోళం ఏర్పడింది. ఎంతకూ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఎంపిడిఒ కె.కృష్ణారావు సమావేశం ముగించారు. ఎమ్మార్‌నగరంలో జరిగిన గ్రామసభకు కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల జన్మభూమి పరిశీలకులు కె.సాంబశివరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఆర్ తిరుపతిరావు ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ అధికారులు ప్రోటోకాల్ పాటించి తనకు గౌరవం ఇవ్వకుండా సభను నిర్వహిస్తున్నారని బయటకు వెళ్లడానికి ప్రయత్నించగా సమావేశం రసాబాసగా మారింది. పరిశీలకుడు, తహశీల్దార్


చినబొండపల్లిలో రసాభాసగా మారిన జన్మభూమి సభ

అజురఫీజాన్ సర్ధిచెప్పడంతో ఆయన శాంతించారు. వెంకంపేటలో మండల ప్రత్యేక అధికారి గాయత్రి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. పలుఅంశాలపై సర్పంచ్ తీళ్ల సుభద్రమ్మ అభ్యంతరాలు లేవనెత్తారు. ఎల్ఎన్‌పురం కూడా పింఛన్లు, రేషన్ కార్డుల విషయంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని పంచాయతీల్లోనూ ముందుగా పశువైద్యశిబిరాలు, వైద్యశిబిరాలు, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు జరిగాయి. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోను చంద్రమౌళి, కొత్తాడ సుధారాణి, ఎంపిటిసిలు పత్ర అసిరయ్య, జెడ్‌పిటిసి జి.గౌరీశ్వరి, పెదబొండపల్లి పిహెచ్‌సి ఛైర్మన్ జి.రామ్మూర్తి, టిడిపి నాయుకులు జాగాన రవికుమార్, భాస్కరరావు, పి.మురళి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సదస్సులో ప్రార్థనాగీతంగా 'నేలతల్లి'

జియ్యమ్మవలస : గుంటూరు జిల్లాలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ రాష్ట్రసదస్సులో ప్రార్ధనా గీతంగా తోటపల్లి జట్టు సంస్థ సంకలనం చేసిన పుస్తకంలోని నేలతల్లికి వందనం అన్న గీతాన్ని ఎంపిక చేశారు. ఈ గీతాన్ని సాహితీస్రవంతి జిల్లాప్రధాన కార్యదర్శి పాయల మురళీకృష్ణ రాశారు. ఈమేరకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రాంగణంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ సదస్సులో జట్టు సిబ్బంది సన్యాసిరావు, దాలినాయుడు, పకీరునాయుడు, నూకంనాయుడు, గాంధీ, గోవిందరావు, గోపీ ఆలపించడంతో ఎంతో ఆనందంగా ఉందని జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు అన్నారు. బడి నుంచి పొలంబడికి వాచక రూపకల్పన, స్థానిక రచయితలతో వర్క్‌షాప్ నిర్వహించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం-మిత్ర కీటకాలు, శత్రుకీటకాలపై పాటలు రాశారు.

పాఠశాల అభివృద్ధికి ఎన్ఆర్ఐ రూ. 2 లక్షల విరాళం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని చినబొండపల్లి జన్మభూమి గ్రామసభలో అదే గ్రామనికి చెందిన విశ్రాంత జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గండి చిన్నంనాయుడు డిజిటల్ క్లాసులు నిర్వహించేందుకు వీలుగా గ్రామంలోని ఎంపియుపి పాఠశాలకు కాలిఫోర్నియాలో ఉంటున్న తన కుమారుడు ఉపేంద్ర రూ.2లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. స్వంత ఊరిలో తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి విరాళం ప్రకటించడం పట్ల గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

విశాఖ నుంచి రాత్రి పూట బస్సులు నడపాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖ నుంచి పార్వతీపురానికి రాత్రి సమయాల్లో బస్సులు కొనసాగించాలని సిపిఎం కొమరాడ మండల నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గతంలో విశాఖ నుంచి పార్వతీపురం రావడానికి రాత్రి 10 గంటల నుంచి ప్రతీ గంటకూ ఒక బస్సు వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. దీనివల్ల దూరప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసలే పండగ సీజనని, ప్రయాణికుల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కావున వెంటనే బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దుకోవాలి


కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బహిరంగ మలవిసర్జనరహిత వార్డుగా తీర్చిదిద్దుకోవాలని ఆరో వార్డు కౌన్సిల్ సభ్యులు సామల మహేశ్వరి అన్నారు. స్థానిక ఎస్‌విడి కళాశాల ఎన్‌సిసి అధికారి డివివిఎస్ గుప్తా, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన మరుగుదొడ్ల ఉపయోగంపై ఆరో వార్డులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మిస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని బహిరంగ మలవిసర్జనరహిత వార్డుగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన వాతావరణం మలుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ వార్డు సభ్యులు బి.సూరమ్మ, బి.కృష్ణ, పి.కనకారావు, ఎస్‌విడి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్వచ్ఛత ర్యాలీ

కురుపాం : స్థానిక కిశోర్‌చంద్రదేవ్ డిగ్రీకాలేజీ విద్యార్థులు స్వచ్ఛత ర్యాలీ గురువారం కురుపాం పురవీధుల్లో నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.తిరుపతిరావు ఆధ్వర్యాన జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశ్రమలను పరిశుభ్రం చేసి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఇందుకు విద్యార్థుల సైతం చైతన్యవంతులు చేయాలని ఆయన కోరారు.

మలమూత్రవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుందాం

కొమరాడ : గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకొని బహిరంగ మలమూత్రవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ రామారావు అన్నారు. గురువారం పాఠశాల నుంచి మండల కేంద్రం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా


కొమరాడలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించేందుకు ఆర్థికంగా కొంత మేరకు సాయం అందిస్తుందని, ఈ మేరకు మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.15వేలు రుణాన్ని అందిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకొని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి-చీపురుపల్లి

పట్టణంలోని కెజిబివి పాఠశాలను గురువారం రాష్ట్ర టీం లీడర్ పి.గీత, రాష్ట్ర అసిస్టెంట్ జిసిడిఒ కె.మురళీధర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ కన్సల్టెంట్ కె.సత్యనారాయణమూర్తి, జిల్లా జిసిడిఒ ఎం.భారతి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర : స్థానిక కెజిబివిని అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిసిడిఒ మురళీధరన్, ఫైనాన్స్ సెక్షన్ అధికారి కె.సత్యనారాయణ, ప్రత్యేకాధికారి ఎ.సుజాతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి రిక్షాలు విరాళం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీకి రూ.1 లక్ష విలువ చేసే రిక్షాలను దాతలు జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు, ఎంపిపి రౌతు కాంతమ్మ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ మెరుగుకోసం దాతలు స్పందించాలన్నారు. గ్రామం బాగుంటే ఆ గ్రామంలో ఉండే ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. సుంకరి తిరుమల, బెల్లాల శ్రీనివాసరావు, చంద్ర, ఇజ్జరోతు అప్పన్న, కండ్యాన శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది ఒక్కొక్కరు ఒక్కొక్క రిక్షా చొప్పున అందజేశారు. అంతకు ముందు ఎంపిపి, జెడ్‌పిటిసిలు దాతలు ఇచ్చిన రిక్షాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు రౌతు కామునాయుడు, వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు, పంచాయతీ ఇఒ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

రైతుబజార్ ధరలు

(నిన్నటి రేట్లు, కిలోకు)



కూరగాయలు	ధర (రూపాయల్లో)
వంగ (తెలుపు)	25
వంగ (రవ్వ)	25
వంగ (నలుపు)	20
టమాటా దేశవాళి	11
టమాటా హైబ్రిడ్	11
బెండ	36
కాకర	26
బీర	38
క్యాబేజీ	20
పొడుగు చిక్కుడు	26
క్యారెట్	28
దొండ	26
బీట్‌రూట్	40
ఉల్లిపాయలు	41
బంగాళాదుంపలు	8
అల్లం	35
పచ్చిమిర్చి	30
వెల్లుల్లి	36
గోరుచిక్కుడు	22
మునక్కాడలు	65
కాప్సికమ్	40
కీరదోస	23
నక్కదోస	23
కంద	27
చామ	27
ఫ్రెంచ్ బీన్స్	27
పొటల్స్	30
అకాకర	50

గుర్లగెడ్డ ప్రాజెక్టును పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మెంటాడ

గుర్ల గెడ్డ ప్రాజెక్టు మెయిన్ కట్టను పొడిగించి పూర్తిచేసి ఆయకట్టు దారులకు సాగునీరందించాలని ప్రజాప్రతినిధులు, పలు పార్టీల, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి చలుమూరి వెంకటరావు మాట్లాడుతూ గుర్లగెడ్డ మెయిన్ కట్టను పూర్తిచేసేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు రెడ్డి అప్లపనాయుడు, వైసిపి అధ్యక్షులు రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడారు. అనంతరం ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బుద్దరాజు రాంబాబు మాట్లాడుతూ గుర్లగెడ్డ ప్రాజెక్టుతో 10 గ్రామాలకు చెందిన 3000 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఈ పనులు పూర్తి చేయాలన్నారు. లేకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెవివి జాతీయ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.లక్ష్మణరావు, జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.అనంతరం గుర్ల గెడ్డ ప్రాజెక్టును ప్రాజెక్టు డిఇ పి.రాజ్‌కుమార్, రైతు సంఘం, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు పరిశీలించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



గుర్లగెడ్డను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు,



విశాఖపట్నం నుంచి విజయనగరం వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్సు రైలు నుంచి గురువారం మంటలు వచ్చాయి. కంటకాపల్లి స్టేషన్ వద్ద ఘటన చోటుచేసుకుంది. కొత్తవలస రైల్వేస్టేషన్ మేనేజర్ అప్రమత్తమై మంటలను అదుపు చేయించారు.

(వార్త మెయిన్‌లో)

ఇటుక బట్టీల నిర్వహణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని గర్భాం ఎల్లమ్మ కాలనీలో జనావాసాల మధ్య నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను ఆపాల్సిందిగా జన్మభూమి గ్రామసభలో కాలనీవాసులు గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీకి చెందిన రామారావు, మల్లిఖార్జునరావు, ఆదిలక్ష్మి తదతరలు ఉన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంలో గర్భాంలో 20 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణమూర్తి, గర్భాం వైస్ సర్పంచి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గర్భాం రామమందిరం వద్ద నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 314 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. వీటిని సర్పంచి సావిత్రమ్మ అందజేశారు.

గిరిజన విద్యారంగానికి పెద్దపీట

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వం గిరిజన విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని, గిరిజన సంక్షేమానికి అనేక నిధులు కేటాయిస్తుందని ఎమ్మెల్సీ డి.జగదీష్, ఎమ్మెల్యే బి.చిరంజీవులు అన్నారు. గురువారం స్థానిక కొత్త బెలగాం ఆవరణలో ఏకలవ్య గురుకుల పాఠశాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలల కేంద్రం కొంత నిధులు ఇస్తుందని, మరికొంత రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఐటిడిఎ పిఒ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఈ పాఠశాలల నిర్వహణ కేంద్ర ప్రభుత్వం చూస్తుందని, ఈ ఏడాది విద్యాసంవత్సరం పూర్తి అయిన తర్వాత దీనికి సంబంధించిన అన్ని మౌలికసదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.ఇది కురుపాంలో నడపాల్సి ఉందని, కానీ ఇంకా కొత్త భవనంలో పూర్తిస్థాయిలో నిర్మాణమైతేనే దీన్ని తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డి.శ్రీదేవి, కళాశాల వైస్‌ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజినల్ సెక్రటరీ బిఎస్ రాములు తెలిపారు. ఆర్‌టిసి ఎన్‌ఎంయు నాయకులు గురువారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రీజనల్ వైస్ ప్రెసిడెంట్ పిఎస్ రాజు, టిబి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పరిశుభ్రతకు సహకారం

ప్రజాశక్తి-చీపురుపల్లి

పంచాయతీ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచి మీసాల సరోజిని తెలిపారు. పట్టణంలో లావేరు రోడ్డు గొల్ల వీధిలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో గురువారం ఎంపిపి రౌతు కాంతమ్మ, జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు, మండల తెలుగుదేశం అధ్యక్షులు రౌతు కామునాయుడలతో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెత్త బుట్టలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు రౌతు కామునాయుడు, తహశీల్దార్ బియం ముక్తేశ్వరరావు, ఎంపిడిఒ ఎ. రామకృష్ణ, పంచాయతీ ఇఒ శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ కెఎస్ఎన్ మూర్తి, ఎస్‌డబ్ల్యుపిసి రిసోర్స్ పర్సన్ సుప్రియ, దన్నాన శ్రీరాములనాయుడు, ఎంపిటిసిలు ఆరతి సాహు, టివివి శ్రీదేవి, వార్డు మెంబరు రఘుపాత్రుని స్వాతి, రఘుపాత్రుని చంద్రశేఖర్, కర్రోతు రమణ, సతివాడ ఆదిబాబు, రొబ్బి చిన్ని, యల్లంటి శివ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయమంటున్నారని మొర

చీపురుపల్లి : తమ ఇళ్లల్లోకి దూళి వస్తుంది కొద్దిగా రాకుండా చేయండని బతిమాలితే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపొండని, మిల్లు నుండి దూళిని మాత్రం ఆపలేనని లావేరు రోడ్డులో ఉన్న రైస్‌మిల్లు యజమాని వడ్డాది రాజారావు తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడంటూ అక్కడ నివాశముంటున్న ప్రజలు గురువారం ఎంపిపి రౌతు కాంతమ్మ, జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడి వద్ద మొరపెట్టుకున్నారు. తాము లావేరు రోడ్డులో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నామని రాజారావు రైస్ మిల్లు నుండి పెద్ద ఎత్తున దూళి తమ ఇళ్లలోకి వస్తోందన్నారు. దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎలాగైనా మిల్లు నుండి వస్తున్న దూళిని ఆపి తమ ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రూ.1.70 వేల స్వాధీనం

ప్రజాశకిత-భోగాపురం

మండలంలోని సవరవల్లిలో గురువారం రాత్రి పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేశారు.ఈ సందర్భంగా 9 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి లక్షా 70వేల 444 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.



గోనె సంచులు పడి ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మరిపివలసలో గురువారం గోనెసంచులు పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం కలమట వేణు (48) స్థానిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కళాసీగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఎప్పటిలాగే లారీ నుంచి కిందకు ఖాళీ గోనె సంచులను తీస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. వెంటనే అతని తల వెనుక భాగం, కుడి భుజంపై బలమైన గాయాలయ్యాయి. కుటుంబీకులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించి, చనిపోయాడు. వేణుకు భార్య రాములమ్మ, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు రోధిస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

లారీ ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండలంలోని వైకెఎంకాలనీ సమీపాన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మజ్జిగౌరి కాలనీకి చెందిన చొక్కాపు గంగునాయుడు పార్వతీపురం పట్టణం నుంచి ఇంటికి వెళ్తుండగా రాయగడ నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో తలకు, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ రాత్రి ఒకటో వార్డు గాసీవీధికి చెందిన పరిమిక భీమరాజు (భీమ)_ తన భార్య సుభద్రపై అనుమానంతో పెట్రోల్‌పోసి నిప్పంటించాడు.

ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమరాజుపై కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆమె ప్రస్తుతం పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. భీమరాజును అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.



ఆర్‌టిసి బస్సు ముందు వీరంగం సృష్టిస్తున్న యువకుడు

బస్సు ఆపలేదని వ్యక్తి వీరంగం

ప్రజాశక్తి-గరివిడి

తాను అనుకున్న చోట ఆర్‌టిసి బస్సు ఆపలేదని కిలోమీటరు దూరం పాటూ బస్సు ముందర నడుస్తూ ప్రయాణానికి ఆటంకం కలిగించి వీరంగం సృష్టించాడో వ్యక్తి. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు వీరంగం సృష్టించిన ఎన్.రవిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

'అన్ని రంగాల్లో అభివృద్ధే ధ్యేయం'

ప్రజాశక్తి-గరివిడి

అన్ని రంగాల్లో అభివృద్ధి తమ ప్రభుత్వ ధ్యేయమని జిల్లాపరిషత్ వైస్‌చైర్మన్ బలగం కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని తాటిగూడులో తహశీల్దార్ సుభాష్‌బాబు ఆధ్వర్యాన గురువారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమిలో దరఖాస్తులను స్వీకరించి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

'బాబూ' గుర్తుందా..!

పోల రామకృష్ణ అనే రైతు సాక్షాత్తు కలెక్టరేట్‌లోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గతేడాది మెరకముడిదాం మండలం ఉత్తరావల్లికి చెందిన దామోదర వెంకటసూర్యారావు అధికారులు భూవివాదం పరిష్కరించకపోవడం వల్ల కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇక జిల్లాకు గిరిజన యూనివర్శిటీ, ఉద్యానవన కళాశాల మంజూరు చేశామని ద్వారపూడి సభలో గొప్పలు చెప్పినా ఆచరణలో తరగతులు నిర్వహించలేదు. ఇక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి తదితర హామీలు మాటలకే పరిమితమయ్యాయి. జిల్లా అభివృద్ధికి దోహదపడే తోటపల్లి, తారకరామ తీర్థసాగర్, జంఝావతి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైనన్ని నిధులు కేటాయించడంలో ఈ ఏడాది కూడా వివక్ష చూపించారు. వందల కోట్ల వసరమైన తారక రామతీర్థసాగర్‌కు అక్షరాలు ఎనిమిది రూ.కోట్లతో సరిపెట్టడమే ఇందుకు తార్కాణం. జంఝావతి పూర్తికి అడ్డంకిగావున్న ఒడిశా వివాదంపై దృష్టిసారించలేదు. ఏటేటా ప్రారంభోత్సవాలు చేస్తున్న తోటపల్లి ప్రాజెక్టు లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందచని దుస్థితి. ఇక రాష్ట్ర రాజధాని అమరావతిగా ప్రకటించిన సందర్భంగా ఇచ్చిన హామీలనూ చంద్రబాబు గాలికి వదిలేశారు.

జిల్లాలో పారిశ్రామిక నగరం ఎలాగూ ఏర్పాటు చేయలేదు. పైగా గ్రోత్‌సెంటర్, జిల్లా కేంద్రంలోని విటిఅగ్రహారం, సారిపల్లి, కంటకాపల్లి పారిశ్రామిక వాడలు వెలవెలబోతున్నాయి. ఏడాదిలో పూర్తిచేస్తామన్న తోటపల్లి పనులు ఇంకా ప్రహసనంగా కొనసాగుతున్నాయి. ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు, తీరప్రాంతంలో పోర్టు, విజయనగరంలో కలిత కళల సంగీత అకాడమీ హామీలు కలగానే మిగిలాయి. మెడికల్ కాలేజీ హామీపై మచ్చుకు కూడా చర్చజరగడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో జన్మభూమి సభలు ఎందుకనే వాదన ప్రజలనుంచి వినిపిస్తోంది.

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

వివేక్ యాదవ్, ఎస్.పి. జి.పాలరాజు తదితరులతో ఏర్పాట్లపై చర్చించారు. గ్రోత్ సెంటర్ వద్ద హెలిప్యాడ్‌ను, రాజాకాలేజీ వద్ద బహిరంగ సభాస్థలిని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సభాస్థలి వద్ద మున్సిపల్ స్టాల్స్, డ్వాక్రా స్టాల్స్, రైతు స్టాల్స్, ఐసిడిఎస్ స్టాల్స్ ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల చేపడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పర్యటనలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతీరాణి, ఎమ్మెల్యేలు కెఎ నాయుడు, బొబ్బిలి చిరంజీవులు, కోళ్ల లలితకుమారి, మీసాల గీత, ఎంఎల్‌సి ద్వారపురెడ్డి జగదీష్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, డిఎస్‌పి సౌమ్యలత, ఆర్డీవో సుదర్శనదొర, డిఆర్‌డిఎ పీడీ సుబ్బారావు, జెసి-2 కె.నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులపై 'తమ్ముళ్ల' పెత్తనం

ఏకమైన జిల్లా అధికారులు జెసి-2, డిఆర్ఓ నాయకత్వంలో అత్యవసర సమావేశం కావడం, కలెక్టర్ వివేక్‌యాదవ్, మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావులకు ఫిర్యాదు చేయడం విధితమే. ఈ విషయాన్ని సిఎం దృష్టికి కూడా తీసుకెళ్తామని కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికారుల కదలికలపై ప్రభుత్వం కూడా ఆరా తీసినట్టు సమాచారం. సిఎంకు బహిరంగంగా ఫిర్యాదు చేస్తే సమస్య మరింత చర్చ నీయాంశమయ్యే ప్రమాదం ఉంది. అంతిమంగా ఆ ప్రభావం ప్రభుత్వంపైనా పడే ప్రమాదం కనిపిస్తున్న నేపథ్యంలో బహిరంగ ఫిర్యాదుకు తావులేకుండా లోలోపల అధికారులను బుజ్జగించే ప్రయత్నం కూడా జరుగుతున్నట్టు సమాచారం. తమ్ముళ్ల ఒత్తిడితో ఇప్పటికే పలుశాఖల్లో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయి. ఇవే ఆక్రమాలను ఎత్తిచూపుతూ మరికొన్ని అక్రమాలు చేయించుకునేందుకు తమ్ముళ్లు నిరంతరం ఒత్తిడిచేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల సిసి రోడ్ల నిర్మాణాల్లో అధికారులు అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా ఏకవచనాలతో వాడిన తీవ్ర పదజాలం అధికారులను మనస్థాపానికి గురిచేసింది. అధికారులపై ప్రజాప్రతినిధుల దూకుడుపై కలెక్టర్ వివేక్‌యాదవ్‌కు కూడా గుర్రుగా ఉన్నారు. సిఎం పర్యటనలో ఈ అంశం చర్చకు వస్తుందా? లేక అధికారులను లోలోపల బుజ్జగిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

పింఛన్ల కోసం పండుటాకుల పడిగాపులు

క్యూలో సొమ్మసిల్లుతున్న వృద్ధులు
సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

పింఛన్ల కోసం పండుటాకులు పడిగాపులు కాస్తున్నారు. సిగ్నల్ అందక రోజులు తరబడి పింఛన్ల కోసం తిరుగుతున్నారు. గంటల తరబడి క్యూలో నిలుచుంటున్నారు. ఇన్ని అవస్థలు పడుతున్నా సాయంత్రానికి పింఛను అందుతుందన్న గ్యారంటీ లేదు. పింఛన్ల కోసం పడిగాపులు కాయలేక కొంత మంది వృద్ధులు సొమ్మసిల్లుతున్నారు. తాజాగా విజయనగరం మండలం జొన్నవలస లో పింఛన్ల కోసం వెళ్లిన ఓ వృద్ధురాలు స్పృహ తప్పి పడిపోవడం పింఛన్ల కోసం వృద్ధులు పడుతున్న ఇబ్బందులను సాక్షాత్కరించింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే ఎజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో 2,63,009 ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ జరుగుతోంది. ఇందులో వృద్ధాప్య పింఛన్లే 93,818 ఉన్నాయి. వికలాంగుల 37,192, అభయహస్తం 25,774, కల్లుగీత 1,235, వితంతు పింఛన్లు 1,02,268తో పాటు చేనేత 2,722 పింఛన్లను ప్రతి నెలా ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. గ్రామ కార్యదర్శులు, విఆర్‌ఒలు బయోమెట్రిక్ విధానం ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈనెల ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 61శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో సరిగా నెట్ సిగ్నల్ రాకపోవడంతో వృద్ధులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ కోసం బయోమెట్రిక్ మిషన్లను ఎత్తైన ప్రదేశాల్లో తిప్పుతున్నారు.

విజయనగరం మండలం జొన్నవలసలో సుమారుగా 300 పింఛన్లు ఉన్నాయి. గ్రామంలో నెలకో కార్యదర్శి మారడంతో వృద్ధులకు పింఛన్లు అందడం లేదు. ఈ విషయాన్ని ఎన్ని సార్లు అధికారులకు తెలియజేసినా సమస్య పరిష్కారం మాత్రం కావడం లేదు. తాజాగా గురువారం పింఛన్లు కోసం వృద్ధులు పెద్దఎత్తున చేరుకున్నారు. సిగ్నల్ అందకపోవడంతో రోజంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమయంలోనే గ్రామానికి చెందిన దాసరి రాములమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. ఒక్క రాములమ్మేకాదు ప్రతి రోజూ ఎవరో ఒకరు సృహతప్పి పడిపోతున్నారని పింఛను దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పింఛన్ల కోసం వృద్ధులు అవస్థలు పడుతున్నారు. పింఛన్లు, రేషన్ సరుకులు పంపిణీకి వాడుతున్న బయోమెట్రిక్ మిషన్లకు నెట్‌వర్క్ సమస్య వెంటాడుతోంది. ఈ మిషన్లకు ప్రభుత్వం ఎయిర్‌టెల్ సిమ్‌లు వాడుతోంది. ఇవి సరిగా పని చేయడం లేదని కార్యదర్శులు చెబుతున్నారు. మిషన్లు కూడా పాతవి కాడవడంతో సిగ్నల్‌ను అందుకోవడం లేదు. దీంతో తరుచూ సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



జొన్నవలసలో స్పృహతప్పి పడిపోయిన వృద్ధురాలు

వీధుల్లో విద్యార్థులు... పూర్తి కాని పాఠాలు

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంపట్ల ఉపాధ్యాయులు, మేథావులు మండిపడుతున్నారు. పాఠశాలల్లో చదవకుండా ఆటలాడుకునేందుకు ఏర్పాట్లు జన్మభూమి కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో విద్యార్థులు పాఠశాలల్లో లేకుండా మైదానాల్లోను, జన్మభూమి సభల్లోను దర్శన మిస్తున్నారు.

జన్మభూమి జరిగే పది రోజులూ రోజుకో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటిపై విద్యార్థులకు అవగాహనా కల్పించాలని, తరువాత క్రీడా పోటీలు నిర్వహించాలని ఆదేశించింది. దీంతో విద్యార్థులంతా పాఠశాలలోల ఆట పాటల్లో మునిగి తేలుతున్నారు. ఇప్పటికే గత నవంబర్ నెల మొత్తం స్కూలుగేమ్స్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు కారణంగా రెండు నెలలు పాటు విద్యార్థుల చదువులు సాగలేదు. మరోవైపు ఇప్పుడు జన్మభూమి సందర్భంగా ఈనెల 2 నుంచి 11 వరకు విద్యార్థులకు పదిరోజులు పాటు క్రీడలు ఆడించాలని ఆదేశించింది. దీంతో విద్యార్థులంతా పాఠశాలల మైదానాల్లోనే ఉంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇవే కార్యక్రమాలు కొనసాగడం వల్ల ఈ పదిరోజులూ పిల్లలకు చదువులు లేనట్టే. మరోవైపు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు జన్మభూమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పనులు అప్పగించింది. పాఠశాలల్లో అభివృద్ధి పనుల వివరాలు తెలియజేయాలి, పాఠశాల లక్ష్యాలను ప్రకటించాలి, గత మూడేళ్లలో ప్రభుత్వం పథకాల ద్వారా పాఠశాలకు వచ్చిన నిధులు గురించి తెలియజేయాలి, పాఠశాలకు సంబందించిన అంశాలతో కూడా ఫ్లెక్సీలను జ న్మభూమి సభల వద్ద ఏర్పాటు చేయాలి, ప్రతిరోజూ జన్మభూమిపై విద్యార్థులకు వ్యాసరచన, మౌఖిక పరీక్ష, ఉపన్యాస, చర్చ పోటీలను నిర్వహించాలి, విద్యార్థులు, ఉపాధ్యాయులు జన్మభూమి అంశాలను గ్రామ, వార్డు ప్రజలకు సభలో వివరించాలి, ఉపాధ్యాయులు ప్రతిరోజూ జరిగిన జన్మభూమి వివరాలను ఫొటోలతోపాటు మండల విద్యాశాఖాధికారికి సాయంత్రం లోగా పంపించాలి. వీటితోపాటు గ్రామాల్లో మరుగుదొడ్ల వివరాలను నోట్ చేయాలి. మరోవైపు ఈనెల 7న జరిగే 5కె రన్‌లో విద్యార్థులంతా పాల్గొనాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ పనులన్నీ ఉపాధ్యాయులు చేస్తుండగా, విద్యార్థులంతా ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు.

20 రోజులపాటు పాఠ్యాంశాలకు స్వస్తి?

విద్యార్థులు 25రోజులు పాటు పాఠశాలకు డుమ్మా కొట్టే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. జన్మభూమి పేరుతో ఈనెల11వ తేదీ వరకు విద్యార్థులు క్రీడా, వివిధ రకాల పోటీల్లో పాల్గొననున్నారు. తర్వాత 12 తేదీ నుంచి 20 వరకు సంక్రాంతి పండగ సెలవులు. మొత్తంగా 20 రోజులుపాటు విద్యార్థులకు పాఠ్యాంశాలు వినే అవసరంలేకుండా పోతుంది. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మాత్రం జన్మభూమి నుంచి మినహాయింపు ఇచ్చారు. ప్రైవేటు పాఠశాల విద్యార్థులు చదువుకుంటుంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రం జన్మభూమి పుణ్యమా అని చదువులేకుండా పోతున్నారు. ఇలా ఉంటే వందశాతం ఫలితాలు ఎలా వస్తాయో ప్రభుత్వ పెద్దలే సమాధానం చెప్పాలి.



నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ స్వాతీరాణి, ఎమ్మెల్యే మృణాళిని

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

జెడ్‌పి చైర్‌పర్సన్ స్వాతీరాణి

గుర్ల : రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని జెడ్‌పి చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతీరాణి అన్నారు. గురువారం మండలంలోని కెల్ల గ్రామంలో జరిగిన జన్మభూమిసభలో ఆమె పాల్గొన్నారు. తొలుత గ్రామంలో రూ.43లక్షలతో నిర్మించిన రక్షిత నీటి పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ కిమిడి మృణాళిని మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్న విషక్షీఆన్ని ఆయన సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఇళ్లు పింఛన్లు కావాలని కోరుతూ పలువురు పేదలు వినతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమలరాజు పద్మిని, ఎంపిపి జమ్ముసత్యం, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు టి.కిరణ్‌కుమార్, ఎంపిడిఒ రవిచంద్ర, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - బొబ్బిలి టౌన్

సంక్రాంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక 25వ వార్డు ఆళ్వారు వీధిలో గురువారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ సమస్యలేమైనా తలెత్తితే మహిళలంతా ఏకమై పోరాడాలని అన్నారు. కె.పుణ్యవతి మాట్లాడుతూ మహిళల్లో సృజనాత్మకతను వెలికి తీయటానికి, మహిళలు అన్ని రంగాల్లో ముందుంటూ ఆత్మవిశ్వాసంతో మెలగడానికి ఈ పోటీలు నిర్వహించామన్నారు. పట్టణ అధ్యక్షులు డి.లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో సగ భాగమైన మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, చుక్కలన్నీ కలిసి ఒక అందమైన ఆకారం ముగ్గురూపంలో వస్తుందని, ఇది మహిళల ఐక్యతకు చిహ్నమని అన్నారు.కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.పుణ్యవతి, డి.రామలక్ష్మి, సీతమ్మ, సోని, ఎ.నాగమణి, ఎ.రమ, దీరజ్ కుమారి, ఎ.ఉమ, అరుణ, యు.లావణ్య పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఐద్వా నాయకులు

'జన్మభూమి'కి హాజరుకాని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దళితుల ఓట్లతో ఎమ్మెల్యే, చైర్మన్‌ను గెలిపించడం తప్పా, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి, సమస్యలు పరిష్కారానికి ఏర్పాటుచేసిన జన్మభూమి సభకు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ఎందుకు హాజరుకాలేదని, 5 వార్డుపై తెలుగుదేశం నాయకుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని పట్టణంలో గురువారం జరిగిన జన్మభూమి సభలో స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. పట్టణంలోని 5 వార్డు బుంగ వీధిలో జన్మభూమి ప్రత్యేకాధికారి మున్సిపల్ డిఇ మత్యరాజు ఆధ్వర్యంలో సభను నిర్వహించారు. వార్డులో అత్యధికంగా దళితులే ఉన్నారు. దళిత వార్డులో అనేక సమస్యలతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఇళ్లు, పింఛన్లు, రోడ్లు, కాలువలు వంటి మౌలిక సమస్యలతో వార్డు ఇబ్బంది పడుతున్నారు. వీటిపై స్థానిక ప్రజలు గట్టిగా అడుగుతారనే భయంతోనో లేక, దళిత కాలనీ వెళ్లకపోయినా ఫర్వాలేదు అని ఆలోచించారో కానీ మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే కానీ ఎవ్వరూ జన్మభూమి సభకు హాజరుకాలేదు. ఇదే కాదు గత నాలుగు జన్మభూమి సభలకు కూడా వీరెవ్వరు హాజరుకాలేదని స్థానిక మహిళ లక్ష్మి ఆవేదన వ్యక్తపరిచింది. సభలో అధికారులను పేదలు నిలదీసింది. ఆమెతోపాటు మరికొంత మంది మహిళలు అధికారులను ఇళ్ల కోసం, పింఛన్ల కోసం ప్రశ్నించారు. మరోవైపు దళితులు ఎక్కువుగా ఉండే వార్డు గొడవ జరుగుతుందని ఎస్ఐతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించిన పాలకులు ప్రజా సమస్యలను తెలుసుకోవడం కోసం హాజరు కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో రిజర్వేషన్లు ఉన్న వార్డులు 1,2,5, 30,19. ఇవి ఎస్‌సి, ఎస్‌టిలకు చెందినవి. వీటిలో కొంచెం నోరున్న కౌన్సిలర్ల దగ్గరకు మాత్రం పాలకులు వెళ్తున్నారు తప్ప గట్టిగా అడగని కౌన్సిలర్ల గురించి అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో దళితులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

దళితుల వార్డు కావడమే కారణమా?



అధికారులను నిలదీస్తున్న ఐదో వార్డు ప్రజలు

పట్టణాభివృద్ధికి సహకరించండి

పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ కోరారు. గురువారం 14, 25 వార్డుల్లోని నిర్వహించిన జన్మభూమి సభలో ఆయన మాట్లాడారు. రానున్న కాలంలో పట్టణాన్ని మరింత సుందరంగా తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దీనికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. అనంతరం చంద్రన్న బీమా బాండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సుంకరి విజయలక్ష్మి, చినతల్లి, కరణం విజయలక్ష్మి, పట్టణ ప్రణాళికా విభాగం అధికారి శోభన్‌బాబు, డిఇ ప్రసాదరావు పాల్గొన్నారు.



వినతి అందజేస్తున్న రెడ్డి శంకరరావు, కళాసీలు

'జిసిసి కళాసీలకు ఉపాధి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిసిసి గోడౌన్ తరలింపును ఆపి కళాసీలకు ఉపాధి కల్పించాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం జిసిసి గోడౌన్ ఎమ్‌డి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడౌన్ ఆధారంగా 40 సంవత్సరాలుగా కళాసీ కుటుంబాలు బతుకుతున్నాయన్నారు. క్వింటాకు రూ.50 పైసలు చెల్లించినప్పటి నుంచి కళాసీలకు ఈ కుటుంబాలు గోడౌన్ మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పేదలైన కళాసీలు ఇదే ఆధారంగా బతుకుతున్నారన్నారు. ఉన్నఫలంగా అనంతపురం జిల్లాలో ఉన్న గోడౌన్‌కు సరుకులు పంపించి ఇక్కడ గోడౌన్‌ను మూసివేయాలని నిర్ణయం తీసుకోవడంతో కళాసీ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. తక్షణమే అధికారులు ఇదే పనిని నమ్ముకున్న కళాసీలకు జీవన భృతిని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వినతి అందజేశారు. ధర్నాలో సిఐటియు నాయకులు బి.రమణ, బి.అప్పన్న, కె.సూర్యనారాయణ, కె.కృష్ణ, బి.అచ్చన్న, కళాసీలు పాల్గొన్నారు.

'బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో గల బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చే బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించవద్దని ఆదివాసీ హక్కుల సాధన ఐక్య కార్యాచరణ కమిటీ వైస్ చైర్మన్ అలుగు వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చుతూ చేసిన తీర్మానం పరిగణలోకి తీసుకోద్దన్నారు. అది అశాస్త్రీయమైన ప్రక్రియన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

సామూహిక మరుగుదొడ్లు నిర్మించరూ...

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పట్టణంలోని రామకృష్ణనగర్‌లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ఐద్వా నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారికి ఐద్వా నాయకులు జగదాంబ ఆధ్వర్యాన వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామకృష్ణనగర్‌లో నివాసముంటున్న 140 కుటుంబాలకు 11 ఏళ్లగా మరుగుదొడ్లు లేవన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా అయినా అధికారులు ఇక్కడ మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు నాగమణమ్మ, లక్ష్మి, నాగమణి, రుప, శాంతమూర్తి పాల్గొన్నారు.



టౌన్ ప్లానింగ్ అధికారికి వినతి అందజేస్తున్న నాయకులు

జిల్లాకు సిఎం ఏం చేశారో చెప్పాలి : వైసిపి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత జన్మభూమి సభలో ప్రకటించిన హామీలను, జిల్లాకు చేసిన అభివృద్ధిని శుక్రవారం జరగనున్న జన్మభూమి-మాఊరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించాలని వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సత్యా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జన్మభూమిలో జిల్లా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా మళ్లీ బొబ్బిలిలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనడం జిల్లా ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోల అజయ్, యువజన విభాగం నాయకులు అవనాపు విక్రమ్, మాజీ ఎంఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, డిసిసిబి వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ, ఎ.శ్రీరాములునాయుడు, కౌన్సిలర్ జి.అప్పారావు, పతివాడ సత్యనారాయణ, అల్లు సత్యాజీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి



విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న బ్రాంచి మేనేజర్ సాయిప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ఎల్ఐసి విజయనగరం బ్రాంచి మేనేజర్ జి.సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఎల్ఐసి క్లాస్1 ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పేర్ల సత్తయ్యొట్టి చెవిటి, మూగ పాఠశాల విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పట్ల సేవాతత్పరత కలిగి ఉండాలన్నారు. వారిని గౌరవించడం నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ చిట్టిబాబు, బ్యాంకు అధికారులు భాస్కరరావు, అచ్యుతావల్లి, రజనీకుమార్, మణికుమార్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి సిద్ధార్థ, ఏజెంట్లు సంఘం కార్యదర్శి ఎన్ సూరినాయుడు, తిరుపతినాయుడు, శంకరరావు, అనేకమంది ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ జయంతి వేడుకలకు హాజరైన అంధులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అంధులకు ప్రత్యేకమైన లిపిని రూపొందించడం ద్వారా లూయిస్ బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగును ప్రసాదించారని ద్వారకామాయి అంధుల పాఠశాల వ్యవస్థాపకురాలు మాచెపల్లి ఆశాజ్యోతి తెలిపారు. బ్రెయిలీ జయంతిని పట్టణంలోని పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

విజేతలకు బహుమతులు అందజేత

విజయనగరం కోట : ఆధ్యాత్మిక అంశాలపై ఏర్పాటుచేసిన ప్రతిభా పరీక్షలో విజేతలైన విద్యార్థులకు గురువారం బహుమతులను అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈ రామాయణం నైతిక విలువల సమాహారం అన్నారు. రామనారాయణంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి యువతకు వివేకానందుని వంటి మహనీయుల జీవిత విశేషాలను, గాంధీజీ వంటి దేశభక్తుల నడవడికను, సంప్రదాయపు విలువలు నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాగా ఈ పోటీలో పూసపాటిరేగ మండలం పశుపాం జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమంలో వేద పాఠశాల వైస్ ప్రిన్సిపల్ షణ్ముఖశర్మ, పశుపాం జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 15 వార్డులో ఉన్న బాలికల హైస్కూల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. బాలికలకు కబడ్డీ, వాలీబాల్, తొక్కుడుబిళ్ల, ఖోఖో వంటి క్రీడలను ఆడించారు. బాలురకు కూడా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి క్రీడలను ఆడించారు. పోటీలను కస్పా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలకు విశేష స్పందన లభించింది.

ప్రజాశక్తి
విజయనగరం
శుక్రవారం
5 జనవరి 2018

సామాన్యునిపై మరో పిడుగు

- డిపాజిట్‌దార్లకు 'ఎఫ్‌ఆర్‌డిఐ' భయం • బ్యాంకులు దివాలా తీస్తే భద్రత కరువు
- డబ్బులు వెనక్కి తీసుకుంటున్న ఖాతాదారులు • జిల్లాలోనూ మొదలైన ఆందోళన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

డబ్బు, బంగారానికి ఎక్కడ రక్షణ దొరుకుతోంది అంటే... చిన్న పిల్లాడైనా బ్యాంకులనే చెబుతాడు. కానీ కేంద్ర ప్రభుత్వం తెస్తున్న ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లుతో బ్యాంకులో దాచుకున్న డబ్బుకు గ్యారంటీ లేదని తెలియడంతో ఇక సామాన్యుని సంపదకు రక్షణ లేదని తేలిపోయింది. కష్టపడి సంపాదించుకుని దాచుకున్న ప్రతి రూపాయి బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న డిపాజిట్‌దారులకు ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్‌ఆర్‌డిఐ) భయం పట్టుకుంది. బ్యాంకులు దివాళా తీస్తే ఫిక్స్‌డ్, సేవింగ్ ఖాతాల్లో ఉన్న నగదును జమ చేసుకునే వెసులుబాటు బ్యాంకులకు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేయడంతో డిపాజిట్‌దారులు బ్యాంకుల్లో ఉన్న ఎఫ్‌డిలను నగదు రూపంగా మార్చుకునేందుకు పరుగులు తీస్తున్నారు.




జిల్లాలో సుమారుగా 300లకు పైగా వివిధ బ్యాంకు శాఖలు పని చేస్తున్నాయి. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు వీటిలో పొదుపు చేసుకుని అవసరాలకు తీసుకోవడం సామాన్య కూలీ నుంచి మధ్యతరగతి వరకూ చేసే పని. పొలాలు, ఇతర ఆస్తులు అమ్మినప్పుడు వచ్చే పెద్ద మొత్తాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ల కింద బ్యాంకుల్లో జమ చేసి అలా వచ్చే వడ్డీతో కలిపి గడువు ముగిశాక తీసుకుంటున్నారు.

బ్యాంకులను జాతీయం చేశాక ప్రజలకు, ఖాతాదారులకు సేవలు మరింత అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. జాతీయ, ప్రైవేటు, కోఆపరేటివ్ పరిధిలోని బ్యాంకులన్నీ ప్రభుత్వ పథకాల అమలుతోపాటు రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు రుణాలు అందిస్తూ, ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తూ ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్నాయి. 1991లో డిపాజిట్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్‌ను (డిఐసిజిసి) నెలకొల్పి బ్యాంకులు దివాళా తీస్తే బీమా కింద రూపాయికి రూ.లక్ష వరకు డిపాజిటర్లకు చెల్లించేలా ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. బ్యాంకులు దివాళా తీస్తే వాటిని ఆర్‌బిఐ స్వాధీనం చేసుకుని ఆర్థిక తోడ్పాటు అందించి డిపాజిట్ల సహకారంతో తిరిగి బ్యాంకు ఆర్థిక పరిస్థితి చక్కపడేలా చర్యలు తీసుకునేవారు. దీనివల్ల డిపాజిటర్లకు ఎలాంటి నష్టమూ లేకుండా ఫిక్స్‌డు డిపాజిటు భద్రంగా ఉండేవి. ఇలా అన్ని రకాల డిపాజిట్లు జిల్లాలోని బ్యాంకుల్లో రూ.కోట్లలోనే ఉన్నాయి. బ్యాంకుల మనుగడలో డిపాజిటర్లు ఎంతో కీలకం. అందుకే లక్ష్యాలను విధించి మరీ డిపాజిట్లు సేకరించాలని ఉన్నతాధికారులు ఒత్తిళ్లు తెస్తుంటారు. డిపాజిటర్లు గ్యారంటీగా ఉంటే రుణమిచ్చే పరిస్థితులు కూడా ఉన్నాయి.



'ఎఫ్‌ఆర్‌డిఐ' బిల్లుపై కేంద్రం చర్యలు

'సొమ్ము జనానిది. సోకు బ్యాంకులది' అన్న చందంగా కేంద్రం తెస్తున్న ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు ఉన్నట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లు-2017ను కేంద్ర ఆర్థిక శాఖ శీతాకాల సమావేశంలో పార్లమెంటులో ప్రవేశ పెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. దీన్ని ఆమోదిస్తే డిపాజిటర్లకు ఎన్నో కష్టాలు తలెత్తుతాయి. బ్యాంకు దివాళా తీస్తే దాని పరిధిలోని డిపాజిట్లను స్వాధీనం చేసుకుని సర్దుబాటైన తర్వాత చెల్లించే వెసులుబాటు ఈ బిల్లు ద్వారా కల్పిస్తున్నారు. ఇప్పటికే కార్పొరేట్ సంస్థలకు రూ.కోట్ల రుణాలు ఇచ్చి వసూళ్లు చేయలేక బ్యాంకులు నష్టాల్లో నడుస్తున్నాయి. అంతేగాక నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) రూ. కోట్లలో ఉండడంతో డిపాజిటర్లు ఆందోళనలో ఉన్నారు. సేవింగ్ ఖాతాలతోపాటు ఫిక్స్‌డు డిపాజిట్లలో ఉన్న సొమ్ము బ్యాంకుల్లోనే భద్రంగా ఉంటుందన్న భావన ప్రజల్లో ఉండడంతో ఇంతవరకు ఎలాంటి ఆందోళనా లేదు. కానీ కొత్త ప్రయత్నాలతో వారిలో వణుకు పట్టుకుంది.



డిపాజిట్‌దారుల్లో ఆందోళన

ఈ బిల్లు చట్టరూపం దాలుస్తుందన్న సమాచారంతో ఖాతాదారులు బ్యాంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమ డిపాజిట్లు విత్‌డ్రా చేసుకోవాలని బ్యాంకర్లపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు వస్తుంది కాబట్టి, మా డబ్బుకు గ్యారంటీ లేదు కాబట్టి తిరిగి ఇచ్చేయాలని కోరుతున్నారు. దీంతో బ్యాంకు అధికారులు ఆందోళన చెందుతున్నారు.

బ్యాంకు మనుగడకు ప్రమాదం

ఒకేసారిగా ప్రజలు తమ డిపాజిట్లు విత్‌డ్రా చేసుకోవడం బ్యాంకుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందని అధికారులు భావిస్తున్నారు. బ్యాంకర్లు, ఉన్నతాధికారులు ఈ బిల్లు, డిపాజిట్ల విత్‌డ్రాలపై మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే మాట్లాడాలి తప్ప ఎలాంటి ప్రకటనలూ చేయకూడదని వారు చెబుతున్నారు. దివాళా తీసే బ్యాంకులకే ఆ బిల్లు వర్తిస్తుందని, జాతీయ, ప్రైవేట్ బ్యాంకులన్నీ లాభాల్లో నడుస్తున్నాయని, డిపాజిట్‌దారులు భయపడాల్సిన పనిలేదని మరో అధికారి వెల్లడించారు. మొత్తంపై ఈ బిల్లు ప్రభావం డిపాజిట్‌దారులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది.



బ్యాంకులపై నమ్మకం పోగొట్టేందుకే..



ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లులోని బెయిల్ ఇన్ క్లాజుతో డిపాజిటర్ల అనుమతి లేకుండా బ్యాంకులు షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెడతాయి. దీనివల్ల ప్రజలు తమ అవసరాలకు డబ్బులు పూర్తిగా అందుకుంటారన్న నమ్మకం లేదు. తద్వారా ఇప్పటివరకు ప్రభుత్వ బ్యాంకులు, బీమా రంగాలపై ఉన్న నమ్మకం పోతుంది. ఇది నష్టదాయకం.

ఎం.శ్రీనివాస, జిల్లా అధ్యక్షులు, సిఐటియు.

నష్టాల్లోని బ్యాంకులకే ప్రమాదం



ఎఫ్‌ఆర్‌డిఐతో ఇప్పటికే నష్టాల్లో ఉన్నవాటికే తప్ప, జాతీయ బ్యాంకులకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు. ప్రజలు అంతగా భయపడాల్సిన అవసరం లేదు. ప్రైవేటు బ్యాంకుల్లో ఎక్కువగా సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం కమిటీని కూడా వేసింది. ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు పూర్వాపరాలపై ఇంకా కసరత్తు జరుగుతోంది.

పి. సతీష్, బ్యాంకు ఉద్యోగి.

ఎఫ్‌ఆర్‌డిఐతో నష్టమే



ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థ చాలా బాగుంది. ఖాతాదారులకు ప్రయోజనాలు అందుతున్నాయి. బ్యాంకు దివాళా తీసే దశకు వస్తే ఆర్‌బిఐ రంగంలోకి దిగుతోంది. ఎఫ్‌ఆర్‌డిఐతో నష్టం తప్పదు. బ్యాంకింగ్ వ్యవస్థ బాగున్నప్పుడు ఈ బిల్లు అవసరం లేదు.

వై.సతీష్, ముగడ.

రామకృష్ణ.. నిత్య సేవా తృష్ణ

- ఇప్పటికి 132సార్లు రక్తదానం • ప్రతి మూడు నెలలకోసారి సిద్ధం • ఓ ఉపాధ్యాయుని సమాజ సేవ • కుటుంబమంతా రక్తదాతలే
- ఇతర కార్యక్రమాల్లోనూ ముందంజ • మరణానంతరం దేహదానానికి నిర్ణయం • ఆదర్శంగా నిలుస్తున్న రామకృష్ణారావు



ప్రజాశక్తి - కంటోన్మెంట్

కొంతమంది చెబుతుంటారు.. కొందరు ఆచరించి చూపుతుంటారు.. అలాంటి వారే ఆదర్శప్రాయులుగా సమాజం ముందు నిలుస్తారు.. అందరికీ స్ఫూర్తినందిస్తున్నారు.. అలాంటి వ్యక్తే బొడేపల్లి రామకృష్ణారావు మాస్టారు.. ఆయన ప్రతి మూడు మాసాలకోసారి రక్తదానం చేస్తుంటారు.. ఇప్పటికి 132సార్లు ఇచ్చారు.. కుటుంబ సభ్యులతోపాటు అందర్నీ ప్రోత్సహిస్తుంటారు.. ఇతర సామాజిక కార్యక్రమాల్లోనూ ముందుంటారు.. మరణానంతరం దేహాన్ని కూడా పరిశోధనలకు ఇచ్చేయాలని నిర్ణయించారు.. తన వేతనంలో పది శాతం సేవలకే వెచ్చిస్తుంటారు.. అలాంటి వ్యక్తి గురించి తెలుసుకుందాం..



ఉత్తమ రక్తదాతగా రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంటున్న రామకృష్ణారావు (ఫైల్)

ఇప్పటికి 132సార్లు రక్తదానం చేసి, ఎంతోమంది ప్రాణాలను కాపాడడమే కాకుండా వివిధ సంస్థల ద్వారా రామకృష్ణారావు అనేక రక్తదాన, వైద్య శిబిరాలను, గ్రంథాలయ, ఇతర సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నారు. 1964 జనవరి 22న శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం బొడ్డేపల్లిలో రాములు, లక్ష్మి దంపతులకు మూడో సంతానంగా జన్మించారు. ఆయన విద్యాభ్యాసం శృంగవరపుకోట, విశాఖ, గరివిడి, బొబ్బిలిల్లో సాగింది. 19ఏళ్ల వయసులోనే భారతీయ వాయుసేన (నేవీ)లో టెక్నీషియన్‌గా చేరిన ఆయన 2003లో ఉద్యోగ విరమణ చేశారు. 2006లో ఉపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టారు. తొలుత గుర్ల మండలం చింతలపేటలో పని చేసి, ఇటీవల గంట్యాడ మండలం లక్కిడాం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు.




35 ఏళ్లుగా..

రామకృష్ణారావు ఇప్పటికి 35 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నారు. తొలుత అత్యవసర సమయాల్లో స్పందించిన ఆయన తర్వాత ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి నేరుగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఏదో ఒక బ్లడ్‌బ్యాంకుకు వెళ్లి రక్తం ఇస్తుంటారు. ఈ క్రమంలోనే గతేడాది రాష్ట్ర ప్రభుత్వంతో ఉత్తమ రక్తదాత పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఏడాది భారత్ టాలెంట్స్ అసోసియేషన్ ఉత్తమ అవార్డు కూడా ఆయనకు అందింది. కుమార్తె శ్వేత, భార్య రమాదేవి కూడా రక్తదాతలే. కుమారుడు చాణక్య ఇప్పటికి 28సార్లు, అల్లుడు నవీన్‌కుమార్ 15సార్లు రక్తదానం చేశారు. ఈ కుటుంబమంతా రక్తదాతలే కావడం గమనార్హం.

సామాజిక సేవల్లోనూ..

2006లో ఆయన ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్, తమన్నా ఫౌండేషన్‌లను ఏర్పాటు చేశారు. వాటి ఆధ్వర్యాన ఇప్పటిక 120 వరకు రక్తదాన శిబిరాలను నిర్వహించారు. వీటి ద్వారా సుమారు మూడు వేల యూనిట్లను సేకరించి ఇటు రెడ్‌క్రాస్, అటు ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకులకు అందజేశారు. రెడ్‌క్రాస్ సంస్థలో కార్యనిర్వాహక కమిటీలో సభ్యునిగా వ్యవహరిస్తున్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయి. వీటిని ఓపిక ఉన్నంతవరకు కొనసాగిస్తాను. పిల్లలు ఇప్పటికే స్థిరపడ్డారు. ఉద్యోగ విరమణ తర్వాత చాలామంది వ్యాపారాల వైపు వెళ్లాలని చెప్పినా సామాజిక సేవకే కట్టుబడ్డా. ఉపాధ్యాయ వృత్తి ద్వారా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం సంతోషాన్ని కలిగిస్తోంది. భవిష్యత్‌లో ఒక ఆశ్రమాన్ని ఏర్పాటుచేసి, బిడ్డలు వదిలేసిన తల్లిదండ్రులను ఒకచోట చేర్చాలన్న ఆశ ఉంది.

బి.రామకృష్ణారావు, ఉపాధ్యాయుడు.



రామకృష్ణారావు దంపతులను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ గీత, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్

గ్రామాల్లో, గిరిజన ప్రాంతాల్లో రక్తదానంపై, ఇతర ఆరోగ్య అంశాలపై అవగాహనా ప్రచారం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో యువకులను సంఘాలుగా 15 వరకు ఏర్పాటు చేశారు. మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం వంటివి కూడా చేపడుతున్నారు. ఆయన పని చేసే పాఠశాలల్లో విద్యార్థుల జన్మదినం సందర్భంగా ఒక మొక్కను నాటించి, సంరక్షించేలా ప్రోత్సహిస్తుంటారు. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కలిగిస్తుంటారు. మహిళా, వృద్ధుల దినోత్సవాల్లో ఆయా రంగాల ప్రముఖులను సత్కరిస్తుంటారు. తాను పనిచేసిన గ్రామంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు గ్రామీణ ప్రతిభా విద్యా కుసుమాలు అవార్డును అందజేసి, స్ఫూర్తిని నింపుతుంటారు. స్వైన్‌ఫ్లూ వ్యాధి విజృంభించిన సమయంలో లక్ష మందికి పైగా ఉచితంగా హోమియో మందును పంపిణీ చేశారు. తన శిష్యులతో జరజాపుపేటలోని సాధనా యూత్ క్లబ్, దత్తిరాజేరులోని చేయూత ఫౌండేషన్ సొసైటీ, నందాంలోని ఆదర్శ యువజన సంఘం ఏర్పాటు చేయించడమే కాకుండా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. నందాంలోనే జయంతి రామలక్ష్మణమూర్తి స్మారక గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా దక్షిణభారత హిందీ ప్రచారసభ పరీక్షలకు శిక్షణ ఇవ్వడమే కాకుండా భాషాప్రవీణలో ఉత్తీర్ణులయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. జాతీయ నాయకుల వర్ధంతులు, జయంతులు నిర్వహించి, వారి సేవలను నేటి తరానికి తెలియజేస్తున్నారు. మనిషి బతికున్నప్పుడే కాకుండా చనిపోయాక కూడా సమాజానికి ఉపయోగ పడాలనే ఉద్దేశంతో కళ్లను గరివిడి లయన్స్ కంటి ఆసుపత్రికి, శరీరాన్ని నెల్లిమర్ల మిమ్స్ కాలేజీకి వీలునామాగా రాసిచ్చేశారు.



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న రామకృష్ణారావు (ఫైల్)

సిఎం పర్యటన ఏర్పాట్ల దృశ్య మాలిక

ప్రజాశక్తి ఫొటో ఫోకస్



సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు, జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు



సిఎం రాకకు సిద్ధమైన హెలీప్యాడ్



మైదానాన్ని తడుపుతున్న అగ్నిమాపక సిబ్బంది



బందోబస్తు వివరాలను పోలీసులకు వివరిస్తున్న మంత్రులు గంటా, సుజయ్



సభా స్థలికి సిద్ధం చేస్తున్న వేదిక



ముందుగానే మూత వేయించిన దుకాణాలు


రహదారి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

రహదారి నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని లక్కిడాం జంక్షన్ నుంచి బుడతనాపల్లి వెళ్లే ఆర్అండ్బి రోడ్డును సుమారు 1.40 కిలోమీటర్ల వరకు ఇరువైపులా పెంచారు. సుమారు రూ.90 లక్షలతో తారురోడ్డును నిర్మించారు. ఈ మేరకు రోడ్డు నాణ్యతను గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలనలో క్వాలిటీ కంట్రోల్ డిఇఇ ఇ.రమణ, జెఇ విశాలగుప్త రెడ్డి, రామగోపాల్వర్మ, కమలాకర్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి ఉన్నారు.

'గురుదేవ్' సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి -కొత్తవలస

గురుదేవ్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని శాంతా కంపెనీ సిఇఒ వరప్రసాద్రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ట్రస్టు ఆవరణలో వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు జగదీశ్బాబు సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజయ్శంకర్, ప్రొఫెసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - కొత్తవలస

జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గులివిందాడ, గనిశెట్టిపాలెంలో నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 240 పశువులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేసినట్టు దెందేరు పశువైద్యాధికారి కె.గాయత్రి తెలిపారు.

పాఠశాలల్లో క్రీడా సందడి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు పాఠశాలల్లో క్రీడా సందడి నెలకొంది. చామలపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలల్లో క్రీడల్లో భాగంగా బాలికలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన బాలికలకు తహశీల్దార్ అరుణకుమారి బహుమతులను అందజేశారు. ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పిఇటి పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను సర్పంచ్ గొర్లి దేముడు, హెచ్ఎం లక్ష్మి అభినందించారు


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

మినీ రిజర్వాయరుగా రామసాగరం

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

చీడివలసలోని రామసాగరం చెరువును మినీ రిజర్వాయరుగా మార్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. గురువారం మండలంలోని చీడివలస గ్రామంలో నీరు-చెట్టు నిధులు రూ.35.50 లక్షలతో చేపట్టనున్న రామసాగరం చెక్డ్యాం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామసాగరం చెరువు వరకు ఎమ్మెల్యేతోపాటు జెడ్పిటిసి కోళ్ల రమణమ్మ, వైస్ ఎంపిపి పి.రాజన్న నడిచి వెళ్లారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు కోట్ల రూపాయలతో రామసాగరం చెరువును మినీ రిజర్వాయరుగా మార్చేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. 47 ఎకరాల చెరువును అభివృద్ధి చేసి, మినీ రిజర్వాయరుగా తీర్చిదిద్దితే చీడివలసతో పాటు చీపురువలస, సుందరయ్యపేట, రామచంద్రపురం, ఎం.ఆర్.పురం, తదితర గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. శృంగవరపుకోట మండలంలో చిలకలగెడ్డ, తిమిడి, అలమండ ఆయకట్టను రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి

చెవిలో పువ్వులతో నిరసన

కొత్తవలస మండలంలో చీడివలసలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే ప్రసంగం ముగించాక వైసిపి నాయకులు లెంక వరహాలు ఆధ్వర్యాన కార్యకర్తలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. తమకు ఎమ్మెల్యే పువ్వులు పెట్టొద్దని, గ్రామంలో ఎటువంటి అభివృద్ధి కూడా చేయలేదని నినాదాలు చేశారు. గులివిందాడ, గనిశెట్టిపాలెంలో తహశీల్దార్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యాన గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కోళ్ల రమణమ్మ, ఎంఇఒ జి.శ్రీదేవి, సర్పంచ్ గవర కల్యాణి, జామి లక్ష్మి, మేడపురెడ్డి లక్ష్మి.. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.లలిత, ఎంపిడిఒ నారాయణరావు, టిడిపి మండల అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు


సావిత్రిభాయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయినులు

సావిత్రిభాయికి నివాళి

దత్తిరాజేరు : సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు మండలంలోని పెదమానాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ వి.రాధాభవానీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరవర్మతో కలిపి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పూలే సేవలను కొనియాడారు. ఆమెను పిల్లలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు సర్వలక్ష్మి, జి.లక్ష్మి, ఇంద్రావతి, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఒడిఎఫ్పై అవగాహన ర్యాలీ

గజపతినగరం : ఒడిఎఫ్పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రిన్సిపల్ కెవిబి విఠల్ పర్యవేక్షణలో గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్వచ్ఛ విజయనగరం జిల్లాకు ప్రజలంతా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్వి సన్యాసిరావు, అధ్యాపకులు డి.శివరామకృష్ణ, బి.సింహాప్రసాద్, టి.వెంకటరావు, రవికుమార్, ఎస్వి రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు

ప్రజాశక్తి - బొండపల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాన్ని తలపెట్టిందని గజపతినగరం ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు అన్నారు. గురువారం బొండపల్లి మండలంలోని ఒంపల్లి, కొండకిండాం, కె.అగ్రహారం, రాచకిండాంలో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఒంపల్లిలో సర్పంచ్ ఇల్లాపు కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాచకిండాంలో జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు జన్మభూమి - మా ఊరు చిహ్నంగా ఏర్పడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బి.నర్సింహవర్మ, జెడ్పిటిసి సభ్యులు బి.బాలాజీ, తహశీల్దార్ బాపిరాజు, ఇఒపిఆర్డి రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : మండలంలోని తాడెందొరవలస, కె.కృష్ణాపురం, చౌదంతివలస, కోమటిపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బి.రాజేశ్వరి పలువురు లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు, విద్యార్థులకు స్కాలర్షిప్లు, రైతులకు పట్టాదారు పాస్పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణవేణమ్మ, తహశీల్దార్ కల్పవల్లి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.


బొండపల్లి.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు

గంట్యాడ : మండలంలోని బుడతనాపల్లి, చినమానాపురం, రామభద్రపురం, మోకాలపాడు గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో జెడ్పిటిసి సభ్యులు కె.రమేష్కుమార్ మాట్లాడుతూ గంట్యాడలో వచ్చే ఫిబ్రవరిలో చంద్రన్న విలేజ్మాల్ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం బుడతనాపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులతో మరుగుదొడ్ల నిర్మాణంపై నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠం, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కె.భాస్కరనాయుడు, అల్లు విజయ్కుమార్, వైస్ ఎంపిపి రంధి రామునాయుడు, ఎంఇఒ విజయలక్ష్మి, ఎపిఎం ఆదిలక్ష్మి, ఎపిఒ శైలాష్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీత

గజపతినగరం : మండలంలోని సాలిపేటలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో అధికారులను వైసిపి నాయకులు జి.పైడిపునాయుడుతోపాటు పలువురు అడ్డుకొని సమస్యలు పరిష్కారం కాని సభలు ఎందుకంటూ నిలదీశారు. గ్రామంలో అనేక మంది అర్హులున్నా పింఛనుకు నోచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకే పథకాలంటూ నిలదీశారు. దీనికి అధికారులు సమాధానం చెప్పలేక బిక్కమొహం వేశారు. కొణిశలో జరిగిన గ్రామసభకు ఎంపిపి జి.శ్రీదేవి, జెడ్పిటిసి సభ్యులు ఎం.శ్రీధర్ హాజరయ్యారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.శేషగిరి, సర్పంచ్ బంగారమ్మ, ఎంపిటిసి సభ్యులు ఎం.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న వైసిపి నాయకుడు

'పేదల దరికి సంక్షేమ పథకాలు'

ప్రజాశక్తి-చీపురుపల్లి

పేదల దరికి సంక్షేమ పథకాలు తీసుకెళ్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర పశు సంవర్ధకశాఖ సంచాలకులు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పేరిపిలో గురువారం జరిగిన జన్మభూమి-మనఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా క్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం



నెల్లిమర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామినాయుడు

చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు, సర్పంచి యలకల శాంతమ్మ, టిడిపి నాయకులు యలకల అప్పారావునాయుడు, తహశీల్దార్ బియ్యం ముక్తేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి జె.మహలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

డెంకాడ : గ్రామాల్లో అభివృద్ధి టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని మండలంలోని రఘమండ, చింతలవలస, అమకాం, గంట్లాంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, సీసీ రోడ్లు, కాల్వల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. అనంతరం అమకాంలో శ్మశాన వాటిక నిర్మాణానికి ఎంపిపి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పతివాడ అప్పలనారాయణ, తహశీల్దార్ పి.రామకృష్ణ, ఎంపిడిఒ జివిఎస్ నిర్మలాదేవి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : జన్మభూమి కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు తెలిపారు. నగర పంచాయతీ పరిధి కొండపేటలో గురువారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ టి.జయరాం, తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి నాయకులు ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుషినిలో వెప్రా సొసైటీ వాష్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చెంబు శవ యాత్ర, స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రాజ్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ హిబ్రహీం, ఎపిఎం రాజ్యలక్ష్మి, వాష్ ప్రాజెక్టు అధికారి ఎల్.రమణ, సర్పంచి మంగమ్మ పాల్గొన్నారు.

పథకాల ప్రచారమే తప్ప... సమస్యలు పట్టించుకోలేదు..

పూసపాటిరేగ : జన్మభూమి కార్యక్రమంలో పథకాల ప్రచారమే తప్పా తమ సమస్యలు పట్టించుకోవడంలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం మండలంలోని చింతపల్లి, లంకలపల్లిపాలెం, గోవిందపురం, చౌడువాడల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లిలో జరిగిన సభలో ప్రభుత్వ పథకాలు చదివి వినిపించారు. సర్పంచి, జెడ్‌పిటిసితో పాటు ఇతర నాయకులకు ప్రభుత్వాన్ని పొగడడంతోనే సరిపోయింది. మీరు చెప్పేది వినడమేనా మా సమస్యలు వింటారా అంటూ మత్స్యకార యువకులు సభలో ఉన్న అధికార్లను, నాయకులను ప్రశ్నించారు. వెంటనే వారికి మైక్ ఇచ్చి మీ సమస్య ఏంటని అడిగారు. మత్స్యకార గ్రామమైన తాము కనీస మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నామన్నారు. రోడ్డు సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. లంకలపల్లిపాలెంలో ప్రభుత్వ పథకాలు టిడిపి కార్యకర్తలకే ఇస్తున్నారంటూ వైసిపి నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఆకిరి ప్రసాదరావు, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, సర్పంచి మైలపల్లి అప్పయమ్మ, సింహాచలం, మైలపల్లి తాత, ఎంపిడిఒ ఎమ్ఎల్ నారాయణరావు పాల్గొన్నారు.



ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మృణాళిని

నాణ్యతలో రాజీవద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఆసుపత్రి నిర్మాణం విషయంలో ఎటువంటి రాజీ పడొద్దని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ఆదేశించారు. మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. చేసిన పనిపై క్రమం తప్పకుండా వాటరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత

ప్రజాశక్తి-మెరకముడిదాం

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అప్రమత్తత ఎంతో అవసరమని చీపురుపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి డి.సింహాచలం తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సును గురువారం మండలంలోని నరసయ్యపేటలో ఎంఎన్‌ఆర్ కళాశాల, శ్రీహర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలలో వంట గ్యాస్ రెగ్యులేటర్ తప్పనిసరిగా ఆపుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం.రాము ఎన్ఎస్ఎస్ పిఒలు ఎస్.విశ్వేశ్వరరావు, టి.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'క్షుద్ర పూజలు అవాస్తవం'

ప్రజావిక్త-నెలిమర్ల

దుర్గాదేవి గుడిలో క్షుద్ర పూజలు జరిగాయన్నది అవాస్తవమని సమతానంద స్వామి తెలిపారు. విజయవాడ కనకదుర్గా గుడిలో క్షుద్ర పూజలు జరిగాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర సాధుసంత్ అధ్యక్షులు, స్థానిక దుర్గదేవి ఆలయ పీఠాధిపతి సమతానందస్వామి స్పందించారు. నెల్లిమర్లలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవిత్ర క్షేత్రాల్లో తాంత్రిక పూజలు జరిపేందుకు ఎటువంటి అవకాశాలు లేవన్నారు. సమావేశంలో శ్రవన్‌చైతన్య చిన్నస్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని గర్భాం కుమ్మరి వీధిలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఎంపిపి తాడ్డి సన్యాసినాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ తహశీల్దార్ ఎంవి రమణమూర్తి, ఇఒపిఆర్‌డి గోపాలకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి, గర్భాం సర్పంచి సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని పేరిపిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి గురువారం సర్పంచి యలకల శాంతమ్మ శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నుండి ఈ కేంద్రానికి నిధులు మంజూరుకావడంతో కేంద్ర పనులు ప్రారంభించనున్నట్లు ఇఒపిఆర్‌డి ఐ.సురేష్ తెలిపారు. ఈ కేంద్రం పనులు పూర్తయితే గ్రామంలోని చెత్తనుఒక చోటకు చేర్చి కేంద్రానికి చేరవేయడానికి వీలుంటుందని, ఆదాయం సమకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి యలకల అప్పారావునాయుడు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగాహన

ప్రజాశక్తి-చీపురుపల్లి

మరుగు దొడ్ల నిర్మాణాలపై పట్టణంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రధానంగా పట్టణంలో అక్షర జూనియర్ కళాశాల, సత్యరామా డిగ్రీ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెంబునకు శవయాత్రను నిర్వహించారు. మెయిన్ రోడ్డు, గాంధీ బొమ్మ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, ఆంజేయపురం వరకు ఈ ర్యాలీ సాగింది. అక్షర కాలేజి విద్యార్థులు ర్యాలీ చేయగా, సత్యరామా కళాశాల విద్యార్థులు చెంబునకు శవయాత్ర నిర్వహించారు. శ్రీనివాసా కళాశాల విద్యార్థులు మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బియ్యం ముక్తేశ్వరరావు, పలు కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి ఫూలే ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-డెంకాడ

సావిత్రిబాయి ఫూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.నిర్మల తెలిపారు. సావిత్రిబాయి ఫూలే వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సింగవరం యుపి స్కూల్‌లో గురువారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి ఫూలే స్ఫూర్తిని నేటి ఉపాధ్యాయులు పునికి పుచ్చుకుని ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవి, అరుణకుమారి, శశికళ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు నిర్మల

'విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి'



విద్యార్థులు వేసిన ముగ్గులను తిలకిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రామతీర్థం సర్పంచి కె.పద్మలత తెలిపారు. ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా గురువారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విజేతలకు బహుమతులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ ఎస్.పురుషోత్తమ్, హెచ్‌ఎం కె.తవిటినాయుడు, తంగుడిబిల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, సిఆర్‌పి ఈశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న తెలిపారు. గురువారం మండలంలోని చింతపల్లిలో జరిగిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో అధికార్లకు మత్స్యకారులు వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ



చింతపల్లిలో సమస్యను వివరిస్తున్న మత్స్యకారుడు

కోనల్లో ఉన్న గిరిజనుల లాగానే మత్స్యకారులు బతుకులు ఉంటాయన్నారు. వారికి ఇచ్చినట్లే మత్స్యకారులకు ఎస్‌టి రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ వినతిని రాష్ట్రంలో జరుగుతున్న అన్ని జన్మభూమి సభల్లో ఆయా ప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులు ఇవ్వనున్నారన్నారు. ఈ విషయమై బొబ్బిలి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి ఇవ్వడానికి సిద్ధమవుతున్నామన్నారు. మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని 1955 నుండి చాలా కమీషన్లు వేశారన్నారు. మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఆ కమీషన్ కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. అనంతరామన్ కమీషన్, మురళీధర్ కమీషన్, కాకా కాలేకర్ కమీషన్, మండల కమీషన్ మొదలైనవి అనేక జాతీయ కమీషన్లు రికమండేషన్ చేసినా ఎస్‌టి జాబితాలో చేర్చలేదన్నారు. మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న రాజన్నదొర, సంధ్యారాణి

గతంలోనే ఏకలవ్య పాఠశాలలు మంజూరు

ప్రజాశక్తి - పాచిపెంట

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏకలవ్య పాఠశాలలు మంజూరయ్యాయని సాలూరు ఎమ్మెల్యే పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని సరాయివలసలో ఈ పాఠశాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాజన్నదొర మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ఇది మంచి అవకాశమని, వారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సీతంపేట స్కూల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షలు రాయాలని, ఇక్కడ అలాంటిదేమీ ఉండదని చెప్పారు. ఎమ్మెల్సీ సంధ్యారాణి మాట్లాడుతూ మాజీ ఎంపి కిశోర్ చంద్రదేవ్ ఈ పాఠశాలకు ప్రతిపాదించినప్పటికీ, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయని చెప్పారు. భంజ్‌దేవ్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల ఘనత ఎన్‌టి రామారావుదేనని చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిడి బి.నారాయణుడు, వైస్ ఎంపిపి పి.గౌరీశ్వరరావు, టిడిపి మండల నాయకులు పి.ప్రసాదబాబు, ఎం.పారమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

డి- గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక

ప్రజాశక్తి - తెర్లాం

చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని మండలంలోని నందబలగ జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం బి.విజయభాస్కర్ తెలిపారు. ఆంగ్లం, తెలుగు, గణిత శాస్త్రాల్లో కనీస అభ్యసన స్థాయిని దాటని విద్యార్థులకు జనవరి ఐదు నుంచి మార్చి 10 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు బేస్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేసిన 62 మందికి సవరణాత్మక బోధనను చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక కృత్యాలు, వారంతపు పరీక్షలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం రాకతో పొట్ట కొట్టారు

ప్రజాశక్తి - బొబ్బిలిటౌన్

సిఎం వస్తున్నందున షాపులు మూసేయ్యమంటే ఇవేవో లైసెన్స్‌లు లేని బారులో, బ్రాంది షాపులో అనుకుంటే తప్పే. శుక్రవారం చంద్రబాబు రాక సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభా స్థలం ఎదురుగా చిన్న, చిన్న దుకాణాలు, జెరాక్స్, బుక్‌షాపులు ఉన్నాయి. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వీటిని మూసేయాలని పోలీసులు యజమానులకు హుకుం జారీ చేశారు. ఇలాంటి సమయంలో ఎక్కువ వ్యాపారం జరుగుతుందని, వీటిని మూసేసి తమ పొట్ట కొట్టొద్దని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముందే తమను ఇబ్బంది పెట్టడం సరికాదని వారు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న దుకాణదారులు

'జన్మభూమి' రసాభాస

టిడిపి నాయకుల మధ్య వివాదం
వ్యక్తిగత దూషణలతో ఉద్రిక్తత
విస్మయానికి గురైన ప్రజలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మామిడిపల్లిలో గురువారం జన్మభూమి కార్యక్రమం రసాబాసగా మారింది. అధికారపార్టీకే చెందినప్పటికీ ఎంపిపి బి.ఈశ్వరమ్మ, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మన్ డి.అన్నపూర్ణమ్మ మధ్య విభేదాలు ఉండడంతో ఇరువురూ సభా వేదిక సాక్షిగా వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. తొలుత ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం ఎక్కడ నిర్మిస్తున్నారో ప్రజలకు తెలపాలని ఎంపిపిని అన్నపూర్ణమ్మ ప్రశ్నించారు. నీటి సమస్య ఉన్న బూర్జవీధిలో పెడుతున్నామని ఎంపిపి చెప్పగా, డొంకవీధిలో ఏర్పాటు చేయాలని అన్నపూర్ణమ్మ అడిగారు. ఈ క్రమంలో నువ్వెంత అంటే నువ్వెంత అని ఒకరిని ఒకరు దూషించుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం గురించి పట్టించుకోవడంలేదని సర్పంచ్ కోడిగాళ్ల శాంతమ్మను అన్నపూర్ణమ్మ గ్రూపు నిలదీసింది. తహశీల్దార్ పి.జనార్థనరావు ఇరుపక్షాలనూ సముదాయించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రమణ, తవుడు, ఇఒపిఆర్‌డి సల్మాన్‌రాజు, ఎఒ వెంకటయ్య పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే జన్మభూమి

బొబ్బిలి : ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే జన్మభూమి కార్యక్రమం చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ టి.అచ్యుతవల్లి అన్నారు. గొల్లపల్లి పాఠశాలలో 10, 11, 12 వార్డుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో



సాలూరులో వాదులాడుకుంటున్న నాయకులు

ప్రత్యేకాధికారి గణపతిరావు, కమిషనర్ హెచ్.శంకరరావు, వైస్‌చైర్మన్ సిహెచ్ రమేష్‌నాయుడు, కౌన్సిలర్లు కె.గోవిందమ్మ, బి.విజయమ్మ పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో..

మండలంలోని మెట్టవలస, గొర్లె సీతారాంపురం, కలవరాయి, కోమటిపల్లిల్లోనూ సభలు నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఉదయ్‌భాస్కర్, ఎంపిడిఒ ఆర్‌వి పద్మజ, తహశీల్దార్ సాయికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సిహెచ్.నీరజ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండేందుకే సభలు

రామభద్రపురం : అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండేందుకే జన్మభూమి సభలు నిర్వహిస్తున్నామని ఎంపిపి ఎ.శ్రీరాములు నాయుడు అన్నారు. ఆరికతోటలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వమూ చేయలేని సంక్షేమ పథకాలు టిడిపి చేస్తోందన్నారు. తర్వాత పాఠశాలకు వెళ్లి విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్థానికులు పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. కార్యక్ర మంలో ఎంపిటిసి సభ్యులు ఎం.ప్రసాద్, సర్పంచ్ ఉమ, మాజీ సర్పంచ్ పి.భీమయ్య, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందాలి

పాచిపెంట : ప్రభుత్వ పథకాలు పార్టీలకతీతంగా అర్హులందరికీ అందజేయాలని ఎమ్మెల్యే రాజన్నదొర అన్నారు. మండలంలోని పద్మాపురంలో జన్మభూమిలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు, జన్మభూమి కమిటీ సభ్యుల సూచనల మేరకే కాకుండా అందరికీ అందించాలని సూచించారు. జిసిసి డిపోల వద్ద బయో మెట్రిక్ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. పెద్దగెడ్డ ఎడమ కాలువ నిర్మించాలని, ఈనామ్ రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేయాలని కోరారు. కేసలి సభలో సిపిఎం నాయకులు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ పెద్దగెడ్డ ముంపు గ్రామమైన మడవలసకి చెందిన 62 కుటుంబాలకు పట్టాలిచ్చిన భూమిని రైతులకు అప్పగించాలని, 40 మంది యువకులకు ఆర్‌ఆర్ ప్యాకేజి వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు. సర్పంచ్ ఎ.సింహాచలం మాట్లాడుతూ 65 ఏళ్ల తర్వాత పింఛను ఇస్తామంటున్నారని, అప్పటివరకు ఎవరు బతికి ఉంటున్నారని అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ఈశ్వరరావు, వెలుగు ఎపిడి జె.సావిత్రి, ఎంపిడిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

సీతానగరం : ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహనఉండాలని నియోజక వర్గ నోడల్ అధికారి కె.సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇప్పలవలస, లక్ష్మిపురం, వెంకటా పురం, చెల్లంనాయుడువలసల్లో జన్మభూమి సభలును ఆయన పరిశీలించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పథకాలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం చంద్రన్న సరుకులను పంపిణీ చేశారు. లక్ష్మిపురం, కామం దొరవలస, చెల్లంనాయుడువలస గ్రామాల్లో సమస్యల ను స్థానికులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వి.సూర్యనారాయణ, సిహెచ్ సత్యవతి, వి.అప్పమ్మ, బి.గౌరినాయుడు, ఎంపిటిసి సభ్యులు డి.నాగరత్నం, జి.రమణమ్మ, ఎంపిడిఒ ఎన్.పార్వతీశం, తహశీల్దార్ కె.అప్పలరాజు అధికారులు పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న నాయకులు, అధికారులు

రశీదులు ఇవ్వాలని డిమాండ్

బలిజిపేట : జన్మభూమి దరఖాస్తులకు రశీదులు ఇవ్వాలని మండలంలోని అరసాడ గ్రామస్తులు డిమాండ్‌చేశారు. ఆ గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో దీనిపై వారు ప్రశ్నించారు. నాలుగో విడతలో దరఖాస్తులే ఇంత వరకు పరిష్కారం కాలేదని విమర్శించారు. ఇలాంటి సభలతో ఉపయోగం లేదని గ్రామ పెద్ద కె.సింహాచలం అన్నారు. అనంతరం ప్రత్యేకాధికారి రాజును వైసిపి నియోజకవర్గ నాయకులు ఎ.జోగారావు స్థానిక సమస్యలపై నిలదీశారు. 54 మంది పింఛన్లకు అర్హులైనా ఇంతవరకు ఇవ్వలేదని దుయ్యబట్టారు. అంతకుముందు గ్రామంలో ఒడిఎఫ్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి పి.పార్వతి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.రాధ, ఎంపిడిఒ కె.ఎస్తేరురాణి, సర్పంచ్ జి.రాములమ్మ, ఎంపిటిసిసభ్యులు అప్పలనర్సమ్మ, ఎపిఒ ఈశ్వరమ్మ, ఎఒ సూర్యనారాయణ, హెచ్‌ఎం మధుసూధనరావు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న జోగారావు

సమస్యలపై వినతులు

తెర్లాం : మండలంలోని చీకటిపేట, అరసబలగల్లో ప్రత్యేకాధికారి పెద్దిరాజు, గోపాలవలస, డి.గదబవలసల్లో ఎంపిడిఒ భానుమూర్తి ఆధ్వర్యాన జన్మభూమి సభలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంపిపి ఎన్ వెంకటరామలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ఉపసర్పంచ్ వెంకటరావు మాట్లాడుతూ గొందాలవలస ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ మంజూరు చేయాలని, నీటి సమస్య పరిష్కరించాలని, రోడ్లు, కాలువలు శుభ్రం చేయించాలని కోరారు. అనంతరం డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యాన వైద్యశిబిరాన్ని నిర్వహించి 63 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. అరసబలగలో ఆనందలహరి పాఠశాలను జెడ్‌పిటిసిసభ్యులు ఎన్‌వి రామలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులతోపాటు ఎంఇఒ జగన్నాధం పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న నాయకులు, అధికారులు

బెదిరింపులు తగవు

ప్రజాశక్తి - సీతానగరం

సిఎం పర్యటనకు రాకపోతే జాబ్ కార్డులు రద్దు చేస్తామని, పనులు చూపబోమని బెదిరింపులకు పాల్పడడం తగదని సిపిఎం డివిజన్, మండల కార్యదర్శులు రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు అన్నారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. సక్రమంగా వారికి డబ్బులు చెల్లించడంపై శ్రద్ధ చూపని అధికారులు, టిడిపి నాయకులు సిఎం సభ కోసం మాత్రం ఒత్తిడి చేయడం సరికాదని అన్నారు. డ్వాక్రా మహిళలను కూడా ఇలాగే తరలిస్తున్నారని విమర్శించారు.

బ్రెయిలీకి ఘన నివాళి

ప్రజాశక్తి - రామభద్రపురం

బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపిడిఒ రామకృష్ణరాజు, ఎంఇఒ ఎ.రాంప్రసాద్ ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ కృషిని వివరించారు. ఆయన లిపి లేకపోతే అంధులు చదువుకు దూరమయ్యేవారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో వికలాంగులు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టిలు కె.ఈశ్వరరావు, అమృతరావు పాల్గొన్నారు.

సావిత్రిబాయి జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - సాలూరు

మహిళా అక్షరాస్యతపై చైతన్యం తీసుకొచ్చిన గొప్ప సామాజిక కార్యకర్త సావిత్రిబాయి ఫూలే అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి విజయకుమార్ అన్నారు. పట్టణంలోని పెదకోమటిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సాయంత్రం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక చైతన్యంతో పాటు చదువుపై ఆమె విశేష కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జగదీష్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జన్మభూమి సభ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు

'జన్మభూమి'తో ఒరిగేదేమీ లేదు

సభను అడ్డుకున్న గిరిజనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సమస్యలు పరిష్కారం కాని జన్మభూమి-మావూరు కార్యక్రమంతో ఒరిగేమిటని ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ ఆధ్వర్యాన గిరిజనులు అధికారులను నిలదీశారు. మండలంలోని ఇరిడిలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యాన గురువారం జన్మభూమి గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇరిడి, తోలుఖర్ర తదితర గ్రామస్తులు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, ప్రాథమిక పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించాలని పలుమార్లు కోరినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని నిలదీశారు. ఇలాంటప్పుడు ఎందుకు ఈ సభలని నిలదీశారు. గిరిజనులకు పట్టాలివ్వకపోవడంతో పట్టాల కోసం చేసుకున్న దరకాస్తులను అధికారుల ముందు తగలబెట్టేందుకు సిద్ధమవ్వగా అధికారులు కలుగజేసుకొని సమస్యను ముఖ్యమంత్రి డేస్‌బోర్డుకు తెలిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం అధికారులు శాఖల వారీగా వారి ప్రగతిని వివరించారు. కుక్కిడి పంచాయతీలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దంటూ నినాదాలు చేసి సభను బహిష్కరిస్తామని సర్పంచి బిడ్డిక చిట్టెమ్మ ఆధ్వర్యాన పంచాయతీ ప్రజలు సిద్ధమవ్వగా అధికారులు కలెక్టర్, పిఒ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో టిడబ్ల్యు ఇఇ కుమార్, డిఇఇ టి.మోహనరావు, సిడిపిఒ విజయలక్ష్మి పాల్గొన్నారు. తహశీల్దార్ ఎన్‌విరమణ ఆధ్వర్యాన మండలంలోని నోండ్రుకోట, పెదఖర్జ పంచాయతీల్లో జన్మభూమి -మాఊరు కార్యక్రమం జరిగింది. సభల్లో గిరిజనులు పలుసమస్యలు పరిష్కరించాలంటూ వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు ఆరిక మహేష్, బిడ్డిక గణపతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో సర్పంచ్ ఇష్టారాజ్యం

'జన్మభూమి'లో ఇటిక గ్రామస్తులు ధ్వజం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రభుత్వ పథకాల పంపిణీలో సర్పంచ్ వారాడ పెంటన్నాయుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఇటిక గ్రామస్తులు ధ్వజమెత్తారు. ఈ గ్రామంలో గురువారం జన్మభూమి-మావూరు గ్రామసభ ఎంపిడిఒ శ్యామసుందర్ అధ్యక్షతన జరిగింది. సభలో చందక సరస్వతమ్మ మాట్లాడుతూ తన భర్త మరణించి 40ఏళ్ల అయ్యిందని, అప్పటి నుంచి వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా తనకు సర్పంచ్ రానీయకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆఖరు గత జన్మభూమిలో మంజూరైన పింఛనను రద్దు చేశారని అధికారులకు ఫిర్యాదు చేసింది. ఇదే సమయంలో నేను చేయను, నీకు నచ్చినట్టు ఫిర్యాదు చేసుకోమని సర్పంచ్ అనడం విశేషం. మరికొంతమంది గ్రామస్తులు మాట్లాడుతూ కాలువల్లో పూడిక తీయించడంలేదని, కొత్తగా కాలువలను నిర్మించడం లేదని, సర్పంచ్ తమ్ముడు ముసలినాయుడు గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణాలు కాంట్రాక్టు చేసి నాణ్యత లేకుండా లబ్ధిదారుల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. దీంతో సభ రసాభసాగా మారింది. అయినా అధికారులేమీ పట్టించుకోకుండా ఎవరిదారిన వారు వెళ్లిపోయి సభను ముగించారు. ఇదిలా ఉండగా, కుందరతిరువాడ, గెడ్డతిరువాడ, అలకవరం, గ్రామాల్లో జన్మభూమి సభలు జరిగాయి. ఈ కార్యక్రమం ఎంపిపి డి.కామేశ్వరి, తహశీల్దార్, ఎపిఒ, ఎపిఎం, ఆయా గ్రామాల సర్పంచులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.




సమస్యలపై అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు, అడ్డుకుంటున్న సర్పంచ్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు

పార్వతీపురంరూరల్ : డివిజన్‌లోని అన్ని గిరిజన గ్రామలకు పక్కా రహదారుల నిర్మాణాలు జరగనున్నాయని ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి పెదమరికి, చినమరికి, గంగమాంబపురం, పిట్టలవలస మీదుగా రూ.2కోట్లతో నిర్మించనున్న బిటి రహదారి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల్లోని అన్ని గ్రామాలతో పాటు, సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న మారుమూల గిరిజన గ్రామలకు రహదారులు వేసేందుకు ప్రణాళికలు సిద్ధమవ్వడంతో పాటు నిధులు కూడా మంజూరయ్యాయని, వీటివల్ల గిరిజన ప్రాంతాలన్నింటికి మైదాన ప్రాంతాలకు రహదారుల అనుసంధానమవ్వడంతో ఆయా గ్రామాలు అభివృద్ధి వేగవంతమవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి హరిప్రియాథాట్రాజ్, జెడ్‌పిటిసి జి.గౌరీశ్వరి, ఏరియా ఆసుపత్రి చైర్మన్ డి.మోహన్, మండల పార్టీ అధ్యక్షులు జి.రామ్మూర్తి, జిల్లా పార్టీ కార్యదర్శి జి.వెంకటనాయుడు నాయకులు సోమశేఖర్, సురగాల ఉమా, తదితరులుపాల్గొన్నారు.



ప్రముఖ న్యాయవాది రామలింగస్వామి మృతి

పార్వతీపురం : పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది రెడ్డి రామలింగస్వామి (84) బుధవారం రాత్రి మృతి చెందారు. 2010-11లో బార్ అధ్యక్షులుగా, పబ్లిక్ ప్రాసుక్యూటర్‌గానూ, మున్సిపల్ స్టేండింగ్ కౌన్సిల్‌గా ఆయన పనిచేశారు. ఈయన భార్య కృష్ణవేణి గతంలోనే చని పోయారు. ఆయనకు కుమారులు రమణమూర్తి, శశిధర్ ఉన్నారు.

రామలింగస్వామి మృతి తీరనిలోటు

న్యాయవాది రామలింగస్వామి మృతి న్యాయవాదులకు తీరనిలోటని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ఎంతో మంది కొత్త లాయర్లకు ఆదర్శంగా ఉంటారని, ఆయన కక్షిదారులకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన మృతికి బార్ తరుపున సంతాపం తెలియజేస్తున్నామన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేస్తేనే అభివృద్ధి : పిఒ

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి గ్రామంలో అందరూ ఐక్యంగా ఉండి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పార్వతీపురం ఐటిడిఎ పిఒ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం రస్తా కుటుంబాయి ఒడిఎఫ్ పంచాయతీలో జరిగే జన్మభూమి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత జన్మభూమి ప్రతిజ్ఞను అధికారులు, ప్రజాప్రతినిధులతో చేయించారు. అనంతరం ఇళ్ల ఎంపిక పత్రాలను, చంద్రన్న కానుకలను అందజేశారు. చెత్త నుంచి తయారు చేసే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సర్పంచి బి.చిన్నమ్మి మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉందని ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించగా, పలుక్రీడల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఒ బి.వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి ఎస్‌వి రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ రంజిత్‌కుమార్, జెడ్పీ కో-ఆపర్షన్ సభ్యులు ఆర్.కె నాయకో, ఎంపిడిఒ పైడితల్లి, తహశీల్దార్ సూర్యకల, సిడిపిఒ రాజ్యలక్ష్మి, ఎడిమెచ్ ఈశ్వరరావు, నీలకంఠాపురం పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్.శ్రావణ్‌కుమార్, ఉపాధిహామీ పథకం ఎపిడి పి.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న కానుకలను అందజేస్తున్న ఐటిడిఎ పిఒ లక్ష్మీశ

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతకు నూరుగంటల్లో ప్రత్యేక శిక్షణను విజయవంతం చేయాలని ఐటిడిఎ పిఒ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు వేసిన సరస్వతి విగ్రహాన్ని పిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, హాస్టల్ సంక్షేమాధికారిని అభినందించారు. చిత్ర రూపకర్త శ్రీనివాస రావును సత్కరించారు. ప్రతి విద్యార్థి కష్టాన్ని ఇష్టంగా చేసుకొని చదివితే మంచి ఫలితాలు వస్తాయని ఆకాంక్షించారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆరు బయట మలవిసర్జన వద్దు

గుమ్మలక్ష్మీపురం : ఆరుబయట మలమూత్ర విసర్జన వద్దంటూ మండలంలోని భద్రగిరి ఎపిఆర్ బాలికల పాఠశాల, జూనియర్ కాలేజి (పిటిజి), ఎపిఆర్ బాలుర పాఠశాల, జూనియర్ కాలేజి విద్యార్థులు గురువారం గుమ్మలక్ష్మీపురంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళు సత్యవతి, రమణమూర్తి, విశ్వనాథం, పద్మావతి ఆధ్వర్యాన ఈ ర్యాలీ ఎల్విన్‌పేట మీదుగా గుమ్మలక్ష్మీపురం వరకు సాగింది. ఆరుబయట మలమూత్ర విసర్జన వల్లే రోగాలు ప్రబలుతున్నాయని, కావున ప్రతి ఇంట్లో మరుగుడ్డి నిర్మించుకోవాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమలో ఎల్విన్‌పేట సర్పంచి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలి

పార్వతీపురం టౌన్ : స్థానిక ఎపిఎస్ ఆర్‌టిసిలో ఎన్ఇసి పరిధిలో అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని, ఆర్ఎం మొండివైఖరి విడనాడాలని ఎన్ఎంయు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధ, గురువారాలు డిపో ఎదుట ప్రధాన రహదారి పక్కన రిలేనిరాహారదీక్షలు నిర్వహించారు. దీక్షలు ముగిసిన సందర్భంగా ఎన్ఎంయు డిపో యూనియన్ కార్యదర్శి ఎవిఎస్‌ బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఆర్ఎం మొండివైఖరి విడనాడాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, ప్రతి కార్మికునికి మూడురోజులు సెలవుదినం కేటాయించాలని, మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ చార్టులు వేయాలని, తదితర సమస్యలపై తమ యూనియన్ ఎప్పటి నుంచో పోరాడుతుందని తెలిపారు. ఆర్ఎం మొండివైఖరివల్ల సమస్యలు పరిష్కారం కావడంలేదని, కావున ఈనెల 7న రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోల నుంచి చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వి రావు, పిజె రాణి, పి.సుశీల, ఎస్‌కె రోజా, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : శత్రుచర్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శత్రుచర్ల

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం అమల చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. మండలంలోని మాదలింగిలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయరామరాజు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్మభూమి కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఆయా అధికారులు నివేదికలు ప్రజలకు అవగాహన కల్పించేలా చెప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు వారికి అందేలా చూడాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం, ఆరోగ్య ఉప కేంద్ర భవనాలను ఆయన ప్రారంభించారు. ఇదిలాఉండగా గుణదతీలేసు పంచాయతీలో ఎంపిడిఒ బి.రామారావు ఆధ్వర్యాన జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విటి జనార్ధనథాట్రాజ్ స్వచ్ఛభారత్, మరుగుదొడ్ల తదితర అంశాలపై మాట్లాడారు. మధ్యాహ్నం నుంచి కెమిశీల, వన్నాం పంచాయతీల్లో సభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహశీల్దార్ రాజకుమారి, జెడ్పీటిసి సభ్యులు ఎస్.పావని, టిడిపి మండల కన్వీనర్ జి.సుదర్శనరావు, టిడిపి జిల్లా బిసిసెల్ అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, ఎంఇఓ జె.నారాయణస్వామి, ఎఓ విజయభారతి, ఇరిగేషన్ జెఇ శ్రీకాంత్, హౌసింగ్ ఎఇ రత్నాకర్, ఎస్ఐ పి.దినకర్, ఐటిడిఎ జెఇ ఇబ్రహీం, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన ఆంధ్రా జట్టు

విజయం దిశగా గుజరాత్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

గుజరాత్ బౌలర్లు ధాటికి ఆంధ్ర జట్టు కుప్పకూలిపోయింది. మొదటి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌట్ అయిన ఆంధ్రా జట్టు, రెండో ఇన్నింగ్స్‌లో 179 పరుగులకే ఆలౌటై ఓటమి దిశలో పయనిస్తోంది. గుజరాత్ బౌలర్లు రాణించి ఆంధ్రా జట్టును ఓటమి అంచున నిలిపారు. చింతలవలస ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న అండర్19 కూచ్‌బెహరా కప్ మ్యాచ్‌లో మొదట ిఇన్నింగ్స్‌లో 201, రెండో ఇన్నింగ్స్‌లో 179 పరుగులకు ఆంధ్ర జట్టు ఆలౌట్ అయ్యింది. బుధవారం నాటికి 7 వికెట్లు నష్టానికి 200 పైన పరుగులు చేసిన గుజరాత్ జట్టు గురువారం ఉదయానికి 318 పరుగులు చేసి ఆలౌటైంది. 117 పరుగులు ఆదిక్యంలోఉంది. అనంతరం రెండో ఇన్నింగ్స ప్రారంభించిన ఆంధ్రా జట్టు కేవలం గురువారం సాయంత్రానికి 65.5 ఓవర్లులో 179 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో గుజరాత్ జట్టు గెలిచేందుకు 63 పరుగుల దూరంలోఉంది. శుక్రవారం ఉదయం 9గంటలకు నాలుగోరోజు ఆట ప్రారంభం కానుంది. దాదాపుగా గుజరాత్ గెలుపు ఖాయం. ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 95 పరుగులు చేసి రాణించిన వంశీకృష్ణ రెండో ఇన్నింగ్స్‌లో కూడా 67 పరుగులు చేసి జట్టును ఆదుకున్నారు. ఆయనకు తోడుగా క్రీడాకారులు ఎవ్వరూ నిలవకపోవడంతో 179 పరుగులకే ఆలౌటైంది. గుజరాత్ బౌలర్లలో ఆకాశ్‌పాండే, ఎస్‌ఎ దేసల్, ఎస్ఎస్ సూర్యల్ బౌలర్లు చెరో మూడేసి వికెట్లు తీసి ఆంధ్ర పతనానికి కారణమయ్యారు.



ఆంధ్రా బ్యాట్స్‌మేన్ వంశీకృష్ణ

రైతు రుణమాఫీపై 11న ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

రైతు రుణమాఫీపై ఫిర్యాదులను ఈనెల 11న వ్యవసాయశాఖ విజయనగరం కార్యాలయంలో ఒఎస్‌డికి సంబంధిత రైతులు అందజేయాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ కోరారు. గన్నవరం రైతు సాధికార సంస్థ నుంచి ఎస్.సంజీవుడును జిల్లాకు ఒఎస్‌డిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆరోజు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యవసాయశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. జిల్లాలోని రైతులు ఫిర్యాదులను, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం వంటి ఆధారాలతో అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

'జన్మభూమి' రాజకీయ వేదిక కాదు

- ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే...
- వైసిపి మునిగిపోతున్న పడవ
- మంత్రులు గంటా, సుజయ్‌కృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం చేపడుతున్న జన్మభూమి కార్యక్రమం రాజకీయ వేదిక కాదని, ప్రజా సమస్యలు తెలుసుకుని, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర గనులశాఖా మంత్రి ఆర్‌వి సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను గురువారం పరిశీలించిన మంత్రులు అనంతరం విలేకర్లతో మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ముఖ్యమంత్రి బొబ్బిలిలో జరిగే జన్మభూమికి హాజరవుతారని తెలిపారు. ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైసిపి మునిగిపోతున్న పడవ అని మంత్రి గంటా విమర్శించారు. ముఖ్యమంత్రి పాల్గొన్న కడప జన్మభూమి సభలో ఎంపి అవినాష్‌రెడ్డి వైసిపి కండువా వేసుకుని వేదికపై మాట్లాడటం సరికాదన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందరికి అందజేస్తున్నామని, ఇది వాస్తవం కాదా అని జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. వెనుకబడిన వర్గాలకు సంక్షేమానికి రూ. 65 వేల కోట్లు ఖర్చు చేశామని, అమరావతి, పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టులు ద్వారా లక్షల ఎకరాలకు నీరందించేందుకు రూప కల్పన చేశామని చెప్పారు.

జగన్‌వి ఆచరణ సాధ్యం కాని హామీలు

ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహనరెడ్డి అధికార దాహంతో ఆచరణ సాధ్యం కాని హామీలిస్తున్నారని మంత్రి అన్నారు. రూ. వెయ్యి పింఛనును రూ.2 వేలు చేస్తామనడం, రూ.2 వేలు పింఛనిస్తే రూ. 3 వేలు చేస్తామనడం అవగాహన లేని, పొంతన లేని మాటలకు నిదర్శనమన్నారు. 45 సంవత్సరాలకే పింఛను మంజూరు చేస్తామనడంపై ఆయన తప్పుపట్టారు.

సిపిఎస్ విధానం కేంద్ర ప్రభుత్వ పరిధిలోది

సిపిఎస్ విధానంపై విలేకరులు అగిగిన ప్రశ్నకు మంత్రి గంటా శ్రీనివాసరావు స్పందిస్తూ ఇది ఇది తమ పరిధిలో లేదని కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున దీనిపై మాట్లాడలేమని అన్నారు. పార్వతీపురంలోని సురేష్ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల జరిగిన సంఘటనపై విలేకరులు ప్రశ్నించగా యాజమాన్యాన్ని ఇప్పటికే అరెస్టు చేశామని, యాజమాన్యాన్ని వెనకేసుకు వచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిఇఒ నాగమణిని ఆదేశించామని తెలిపారు.

సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, ఎమ్మెల్సీలు ద్వారపురెడ్డి జగదీష్, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు కెఎ నాయుడు, బి.చిరంజీవులు, పతివాడ నారాయణ స్వామినాయుడు, కోళ్ల లలిత కుమారి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్‌దేవ్, తెంటు లక్ష్మునాయుడు పాల్గొన్నారు.



ఎస్‌పి, డిఎస్‌పిలకు సూచనలిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు